


Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్




శ్రీసత్యసాయి | సంపుటి: 03 | సంచిక : 45 | బుధవారం 23 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



# బెర్లిన్‌లో వామపక్షం ఘన విజయం

- తొలిసారిగా మేయర్ పీఠంపై కమ్యూనిస్టు ఎలిఫ్ ఎరాల్ప్‌కు పట్టం కట్టిన జర్మన్లు
- న్యూయార్క్ నుంచి బెర్లిన్ వరకు సోషలిస్ట్ ప్రత్యామ్నాయం : ఎంఎ బేబీ

**బెర్లిన్-సూర్య వాస్తవం**

జర్మనీలోని బెర్లిన్ రాష్ట్ర ఎన్నికల్లో వామపక్ష పార్టీ డై లింకె (ది లెఫ్ట్) అతిపెద్ద పార్టీగా అవతరించింది. టర్కీ వలసదారుల కుమార్తెన ఎలిఫ్ ఎరాల్ప్ (45), జర్మనీ రాజధాని నగరానికి తదుపరి మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. పేదరికం, అసమానతలను తగ్గించడమే లక్ష్యంగా ప్రచారం చేసిన ఆమె పార్టీ, నగరంలోని గృహ సమస్యలు, అద్దెల భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చింది. పెద్ద కార్పొరేట్ ఇళ్ల యజమానుల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్న ప్రతిపాదన కూడా ఇందులో భాగంకావడం గమనార్హం. సామాజిక అసమానతలను, పెద్ద వ్యాపార సంస్థల ఆధిపత్యాన్ని తగ్గించాలని కోరుకునే ఎరాల్ప్‌ను, న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన డెమోక్రటిక్ సోషలిస్ట్ నేత జొహ్రాన్ మామ్దానీతో పోలుస్తున్నారు. 1990 జర్మనీ పునరేకీకరణ తర్వాత మొదటిసారిగా బెర్లిన్ మేయర్ కార్యాలయాన్ని

- మిగతా 2లో..

# బీజేపీకి షాక్..

- అధికారిక అభ్యర్థికి ఒక్క ఓటూ పడలేదు!



**రాజస్థాన్ -సూర్య వాస్తవం** : రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లా ముండ్వా మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. 25 వార్డుల్లో 10 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ.. ఛైర్‌పర్సన్ పదవిని మాత్రం దక్కించుకోలేకపోయింది. పార్టీ అధికారిక అభ్యర్థి గీతాదేవికి ఒక్క ఓటు కూడా రాలేదు. ఆర్ఎల్‌పీ అభ్యర్థి అల్కాదేవి కండోయ్ 13 ఓట్లు సాధించి ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఆమెకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన ఘన్‌శ్యామ్ సదావత్‌కు

- మిగతా 2లో..

# మోగిన ఎన్నికల నగారా

- అక్టోబర్ 16న రాజ్యసభ ఎన్నికలు
- మూడు రాష్ట్రాల్లో 12 స్థానాలకు పోలింగ్ .
.అదే రోజు ఓట్ల లెక్కింపు - ఈనెల 29న నోటిఫికేషన్



**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం**

ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ , పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల నగారా మోగింది. రాజ్యసభలో ఖాళీ కానున్న 12 స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉత్తర్?ప్రదేశ్‌లో 10 స్థానాలు, ఉత్తరాఖండ్‌లో ఒకటి, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి అక్టోబర్ 16న ఉప ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది.

**సెప్టెంబర్ 29న నోటిఫికేషన్**

ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీగా ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అక్టోబర్ 9 వరకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను అక్టోబర్ 19లోపు పూర్తి చేయాలని ఈసీ నిర్ణయించింది. రాజ్యసభ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యం గుర్తులను నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి అందించే నిర్దిష్ట వైలెట్ రంగు స్కెచ్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని ఈసీ స్పష్టం చేసింది. ఇతర పెన్నులతో గుర్తులు వేయకూడదని పేర్కొంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పరిశీలకులను నియమించి, మొత్తం ప్రక్రియను పర్యవేక్షించనున్నట్టు తెలిపింది. నవంబర్ 25తో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి సహా పలువురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. వీరిలో ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ నాయకులు అరుణ్ సింగ్, గీతా షాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బిఎల్ వర్మ, సీమా ద్వివేది, ఎస్పీ నేత రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీకి చెందిన రామ్జీ గౌతమ్ ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని రాజ్యసభ స్థానం రుక్మిణి మల్లిక్ రాజీనామాతో 2026 జులై 16న ఖాళీ అయింది. ఈ స్థానానికీ ఇదే షెడ్యూల్

- మిగతా 2లో..

# ఏపీలో భారీ వర్షాలు ..

- ఆరు జిల్లాల్లో స్కూళ్లకు సెలవు
- ఉత్తరాంధ్రకు తుపాను ముప్పు
- 6 జిల్లాల్లో విద్యాసంస్థలకు నేడు సెలవు
- తీవ్ర తుఫానుగా బలపడిన వాయుగుండం
- భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సూచన



**అమరావతి -సూర్య వాస్తవం** : భారీ వర్షాలు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో విద్యాసంస్థలకు ప్రభుత్వం బుధవారం (సెప్టెంబర్ 23) సెలవు ప్రకటించింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లా యంత్రాంగాలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుపానుగా బలపడింది. ఇది ఈ రోజు రాత్రికి ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల మధ్య,

- మిగతా 2లో..



# ఓటర్లకు యాంత్రికంగా నోటీసులా?

- ఢిల్లీ సర్ పై ఈసీ తీరును ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- 'లాజికల్ డిస్క్రెపెన్సీ' అంటే ఏమిటో స్పష్టంగా చెప్పాలి
- ఈసీకి సుప్రీం నోటీస్

**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం** : ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

- మిగతా 2లో..

# ఏపీ పట్టణాలకు కొత్త కళ..

- రాష్ట్రవ్యాప్తంగా రూ.11,359 కోట్ల పట్టణ అభివృద్ధి పనులకు శ్రీకారం
- హెచ్ఏఎం పద్ధతిలో తొలిసారిగా 123 మున్సిపాలిటీల్లో పనుల ప్రారంభం
- కుప్పం నుంచి లాంఛనంగా పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కుల నిర్మాణం లక్ష్యం
- శాంతిపురం వద్ద హంద్రీనీవా కాలువకు జలహారతి ఇవ్వనున్న ముఖ్యమంత్రి



**అమరావతి -సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణాల రూపురేఖలను సమూలంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 106 నియోజకవర్గాల పరిధిలో ఉన్న 123 మున్సిపాలిటీల్లో ఏకకాలంలో పనులు మొదలు కానున్నాయి. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.7,469 కోట్లు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో ప్రత్యేకంగా రూ.3,890 కోట్ల విలువైన పనులను చేపట్టనున్నారు. ఈ నిధులతో ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణానికి రూ.4,656 కోట్లు, సెంట్రల్ మీడియన్ల ఏర్పాటుకు రూ.88 కోట్లు, కొత్త స్ట్రీట్ లైటింగ్ కోసం రూ.247 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.509 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమం పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల మేర స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తాయి. పట్టణ స్థానిక సంస్థలపై

- మిగతా 2లో..



# ఎనిమిదో తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకం..

- ప్రారంభించిన సీఎం విజయ్



# దళితులు, గిరిజనులకు భరోసా

- ప్రభుత్వ పథకాలు.. కార్యక్రమాల్లో పెద్దపీట
- ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ బాధితులకు సత్వర న్యాయం
- హైలెవెల్ కమిటీ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ -సూర్య వాస్తవం** : దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం--1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్సీ ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# మోగిన ఎన్నికల నగారా

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం ఉపఎన్నిక జరగనుంది. ప్రస్తుతం ఉన్న అంచనా ప్రకారం.. అసెంబ్లీలో ఉన్న స్థానాలను బట్టి యూపీలోని 10 స్థానాల్లో 8 బీజేపీ, రెండు స్థానాలు సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకునే అవకాశాలు ఉన్నాయి. సిట్టింగ్ రాజ్యసభ ఎంపీని కలిగి ఉన్న బీఎస్పీ ఒక్క సీటు కూడా గెలుచుకునే అవకాశం లేదు. ఎందుకంటే ఆ పార్టీకి యూపీ అసెంబ్లీలో సభ్యులు లేనందున రాజ్యసభ సీటు దక్కే అవకాశం లేదు. బీఎస్పీకి ఇది క్లిష్టకాలమనే చెప్పుకోవాలి. దీనికి యూపీ అసెంబ్లీలోని ఉభయ సభల్లో, పార్లమెంట్ ఉభయ సభల్లో ఒక్క సభ్యుడూ లేరు. 1989 తరువాత బీఎస్పీకి ఈ పరిస్థితి రావడం ఇదే తొలిసారి. ఇక, ఉత్తరాఖండ్‌లో ఉన్న ఒక్క స్థానాన్ని బీజేపీ దక్కించుకోనుంది. ఆ పార్టీకి అసెంబ్లీలో భారీ మెజారిటీ ఉన్నందున ఆ సీటు బీజేపీకే దక్కనుంది. పశ్చిమ బెంగాల్‌లో కూడా ఈ సీటును బీజేపీయే గెలుచుకోనుంది. ఈ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్?ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరుగుతుండటంతో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# బీజేపీకి షాక్..

(మొదటిపేజీ తరువాయి)

12 ఓట్లు వచ్చాయి.

దీంతో అల్కాదేవి కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. ముండ్వా మున్సిపాలిటీలో బీజేపీ 10, ఆర్ఎల్‌పీ 7, కాంగ్రెస్ 3, స్వతంత్రులు 5 స్థానాలు గెలుచుకున్నారు. బీజేపీకి ఛైర్‌పర్సన్ టికెట్ దక్కకపోవడంతో ఘన్‌శ్యామ్ సదావత్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఎన్నికల్లో ఆయనకు 12 ఓట్లు రావడంతో బీజేపీకి చెందిన 10 మంది కౌన్సిలర్లు పార్టీ అధికారిక అభ్యర్థికి కాకుండా ఆయనకు మద్దతిచ్చినట్లు ఫలితాలు వెల్లడించాయి. కాంగ్రెస్, ఆర్ఎల్‌పీకి కలిపి 10 మంది కౌన్సిలర్లు ఉండగా.. అల్కాదేవికి 13 ఓట్లు రావడం చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచినా ఛైర్‌పర్సన్ పదవి దక్కకపోవడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా నిలిచింది.

# ఎనిమిదో తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకం..

## - ప్రారంభించిన సీఎం విజయ్

**చెన్నై -సూర్య వాస్తవం** : తమిళనాడులోని ప్రభుత్వ స్కూళ్లలో ఇకపై 6-8 తరగతి విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనుంది ప్రభుత్వం. ఈ పథకాన్ని తమిళనాడు సీఎం విజయ్ మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఇప్పటికే పెరుతలైవార్ కామరాజార్ అల్పాహారం పేరుతో ప్రభుత్వ స్కూళ్లలో ఈ పథకం అమలవుతోంది. ఇప్పటిదాకా ఒకటి నుంచి ఐదో తరతి పిల్లలకు మాత్రమే ప్రభుత్వ స్కూళ్లలో అల్పాహారం అందిస్తుండగా.. ఇకపై ఎనిమిదో తరగతి వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దీంతో విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. మంగళవారం సీఎం విజయ్.. చెన్నై, తిరువన్మియుర్, గాంధీ గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్కూల్‌లో పథకాన్ని విస్తరించారు. ఈ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉదయం అల్పాహారం చేశారు. గవర్నమెంట్ స్కూళ్లతోపాటు, గవర్నమెంట్ ఎయిడెడ్ స్కూళ్లలో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఈ పథకం ఇప్పుడు రాష్ట్రంలోని 15,454 స్కూళ్లలో, 15.30 లక్షల మంది విద్యార్థులకు దీని ద్వారా లబ్ధి కలుగుతుంది. ఈ పథకాన్ని విస్తరించేందుకు అదనంగా ఏడాదికి రూ.217.63 కోట్లు ఖర్చవుతుంది. మొత్తం పథకానికి అయ్యే ఖర్చు ఏడాదికి రూ.724 కోట్లకు చేరింది. గతంలో ఈ పథకానికి సీఎం బ్రేక్‌ఫాస్ట్ అనే పేరుండేది. అయితే, తమిళనాడు మాజీ సీఎం, కాంగ్రెస్ నేత దివంగత కే కామరాజ్ పేరు మీద ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించారు.

# ఏపీలో భారీ వర్షాలు ..

(మొదటిపేజీ తరువాయి)

విశాఖపట్నం-గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ ప్రభావంతో అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్), పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని విద్యాసంస్థలకు సెలవు ఇచ్చారు. వాతావరణ శాఖ ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. బుధ, గురువారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రలో ఆకస్మిక వరదలు సంభవించవచ్చని హెచ్చరించింది. తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని తెలిపింది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభం కాగా, కోస్తా ఆంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# ఏపీ పట్టణాలకు కొత్త కళ..

(మొదటిపేజీ తరువాయి)

ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పనులను హెచ్ఏఎం పద్ధతిలో అమలు చేస్తోంది. ఈ విధానంలో కాంట్రాక్టర్లు తమ సొంత నిధులతో పనులు పూర్తిచేయగా, ప్రభుత్వం వారికి వార్షిక వాయిదాల రూపంలో చెల్లింపులు చేస్తుంది. కుప్పంలో పనులు ప్రారంభించిన తర్వాత సీఎం చంద్రబాబు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు, మునిసిపల్ శాఖ అధికారులతో మాట్లాడి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీనీవా కాలువను సందర్శించి కృష్ణా జలాలకు సీఎం జలహారతి ఇవ్వనున్నారు. అనంతరం ఈసీ పౌల్ట్రీ షెడ్ కార్యక్రమం కింద ఎంపికైన కొందరు లబ్ధిదారులతో ముచ్చటించి, మధ్యాహ్నం పార్టీ కేడర్‌తో జరిగే సమావేశంలో పాల్గొననున్నారు.

# ఓటర్లకు యాంత్రికంగా నోటీసులా?

(మొదటిపేజీ తరువాయి)

'లాజికల్ డిస్క్రెపెన్సీ' పేరుతో కొందరు ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, అందులో ఏ అంశంపై వివరణ ఇవ్వాలో స్పష్టంగా పేర్కొనకపోవడాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. కొన్ని నోటీసులు యాంత్రికంగా, బహుశా కంప్యూటర్‌తో రూపొందించి జారీ చేస్తున్నట్లుగా కనిపిస్తున్నాయని పేర్కొంది. సర్ నోటీసులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌లను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఓటర్లను 'డౌట్‌ఫుల్' జాబితాలో చేర్చి, వారి గత రికార్డుల్లో తేడాలు ఉన్నాయంటూ ఈసీ నోటీసులు ఇస్తున్న తీరుపై పిటిషన్‌లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, వివరణ ఇవ్వాలని పేర్కొంది.

**'ఏమి వివరించాలో చెప్పాలి'**

'లాజికల్ డిస్క్రెపెన్సీ' అంటే ఏమిటో ఓటర్లకు స్పష్టంగా తెలియజేయాలని సీజేఐ సూచించారు. ఒక వ్యక్తి గతంలో మరో రాష్ట్రంలో ఓటు వేసి, అనంతరం ఢిల్లీకి వచ్చి ఉంటే.. ఆయన ఓటింగ్ వివరాల్లో ఏ అంశంపై వివరణ కోరుతున్నారో నోటీసులో స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. 'ఢిల్లీ లేదా మరెక్కడైనా ఓటు వేశారా? స్పష్టం చేయండి' అని అడగడం మాత్రమే కాకుండా, ఏ విషయాన్ని స్పష్టం చేయాలో ఓటరుకు అర్థమయ్యే విధంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) మరింత సహకరించాలని సుప్రీంకోర్టు సూచించింది. పాత ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్నాయా, ఏ ధ్రువపత్రాలు అందుబాటులో ఉన్నాయి వంటి అంశాలపై బిఎల్ఒలు ప్రజలకు వివరించగలిగితే ప్రక్రియ సులభమవుతుందని ధర్మాసనం పేర్కొంది. సర్‌కు సంబంధించి ఓటర్లకు ఎదురయ్యే సాధారణ సందేహాలపై ఎన్నికల సంఘం తరచూ అడిగే ప్రశ్నలు-సమాధానాల జాబితాను రూపొందించాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. దాన్ని పత్రికలు, వెబ్‌సైట్లు, స్థానిక సంస్థలు, బీఎల్ఓతో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సీజేఐ సూచించారు. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**33 లక్షల మందికి నోటీసులపై ఆందోళన**

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ ఢిల్లీలో సుమారు 33 లక్షల మందికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. రోజువారీ కూలీలు, సామాన్య ప్రజలు ఇలాంటి నోటీసులకు ఎలా స్పందించగలరని ప్రశ్నించారు. నోటీసుల్లో తగిన కారణాలు, తదుపరి తీసుకోవాల్సిన చర్యలు స్పష్టంగా ఉండటం లేదని వాదించారు. తల్లిదండ్రులు-పిల్లల వయస్సు మధ్య తేడా తక్కువగా ఉందని 'లాజికల్ డిస్క్రెపెన్సీ'గా చూపితే, దాన్ని నిరూపించడానికి ఓటర్లు ఎలాంటి పత్రాలు సమర్పించాలో స్పష్టత లేదని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సంఘం సూచిస్తున్న 12 రకాల పత్రాల్లో ఇలాంటి విషయాలను నిరూపించే సమాచారం లేదని పేర్కొన్నారు.

**'ఒక్క ఓటు కూడా విచారణ లేకుండా తొలగించం'**

ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదిస్తూ ప్రతి సర్ నోటీసులో కారణం పేర్కొంటున్నామని తెలిపారు. అవసరమైన వివరణలను ఓటర్లు సమర్పించవచ్చని, పత్రాల జాబితా పరిమితమైనది కాదని చెప్పారు. 'ఒక్క ఓటరును కూడా విచారణ లేకుండా తొలగించం' అని అన్నారు. నోటీసుల్లో బిఎల్ఒలను సంప్రదించేందుకు వారి పేరు, మొబైల్ నంబర్ వంటి వివరాలు ఇస్తున్నామని తెలిపారు. సర్ ప్రక్రియలో పెండింగ్‌ను తగ్గించేందుకు సిబ్బందిని పెంచుతున్నామని చెప్పారు.అయితే, ప్రభావిత ఓటర్లకు అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం, ప్రత్యక్ష సహాయం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు సూచించింది. ఢిల్లీలో సమీప భవిష్యత్తులో ఎన్నికలు లేనందున ప్రక్రియలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు సమయం ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈసీ నుంచి తక్షణం తీసుకున్న చర్యల వివరాలను కూడా తమ ముందుంచాలని ఆదేశించింది. అనంతరం కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# దళితులు, గిరిజనులకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ముఖ్యమంత్రి సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతో పాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి.

ఈ సమావేశంలో సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రమంగా అయిదేండ్లలో ఎస్సీ ఎస్టీలపై అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల మీటింగ్ లు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలన్నారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, వారికి సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుబాలకు సత్వర న్యాయం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు

. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం, కార్యక్రమంలో వారికి తగినంత ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. దళితులు, గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటినుంచో సొంత బిడ్డల్లా ఆదరించిందని, అందుకే పల్లెపల్లెనా ఇప్పటికీ ఇందిరమ్మను తలుచుకుంటున్నారని చెప్పారు. పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు అందించిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీదని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ స్పూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే.. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్ధిదారులు ఎస్సీలే ఉన్నారన్నారు. ఎస్టీల జనాభా 10 శాతం ఉంటే, వారికి 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని వివరించారు.

రాష్ట్రంలోని 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, దీనివల్ల దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. చదువు ఒక్కటే జీవితాలను మారుస్తుందని.. విద్యతోనే సమాజంలో అసమానతలకు, అణిచివేత రుగ్మతలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పిల్లలను చదువుతో పాటు క్రీడలవైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం మీది. మీ సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

# బెర్లిన్‌లో వామపక్షం ఘన విజయం

(మొదటిపేజీ తరువాయి)

చేజిక్కించుకోవాలంటే ఆమెకు మిత్రపక్షాల మద్దతు అవసరం. సోషల్ డెమొక్రటిక్ పార్టీ (ఎస్‌పిడి), గ్రీన్స్‌తో కలిసి "రెడ్-రెడ్-గ్రీన్" కూటమి ఏర్పాటు చేయాలని ఆమె భావిస్తున్నారు. కానీ ఇది సవాలుతో కూడుకున్న పని. ఆస్తుల స్వాధీన ప్రతిపాదనను ఎస్‌పిడి వ్యతిరేకిస్తోంది. ఉక్రెయిన్‌కు సైనిక సాయం, నాటోపై డై లింకె వైఖరిని కూడా వారు అంగీకరించడం లేదు.

**ద్వేషంపై ప్రేమ విజయం సాధించింది...**

మితవాద, వలస వ్యతిరేక ఎఎఫ్‌డిపై తమ పార్టీ సాధించిన విజయంపై ఎరాల్ప్ హర్షం వ్యక్తం చేశారు. "మా నగరంలో ద్వేషంపై ప్రేమ, న్యాయం విజయం సాధించాయి" అని ఆమె పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం అంతర్గత విభేదాలతో సతమతమైన డై లింకె, ఇప్పుడు జర్మనీ రాజకీయాల్లో అత్యంత చైతన్యవంతమైన శక్తులలో ఒకటిగా మారిందని ఫ్రెంచ్ పత్రిక లె మోండ్ వ్యాఖ్యానించింది. ఓట్ల వివరాలకు సంబంధించి.. బెర్లిన్‌లో డై లింకె పార్టీకి 25.7 శాతం ఓట్లు వచ్చాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఇది 12 పాయింట్లు పెరిగాయి. ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌కు చెందిన సంప్రదాయవాద క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్ (సిడియు) 18.8శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. మితవాద పార్టీ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ ( ఎఎఫ్‌డి) 16.3శాతం ఓట్లతో మూడో స్థానంలో, గ్రీన్స్ 14.3శాతం ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచాయి. సెంటర్-లెఫ్ట్ ఎస్‌పిడి కేవలం 12.1శాతం ఓట్లతో ఐదో స్థానానికి పరిమితమైంది. బెర్లిన్ రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆ పార్టీకి ఇదే అత్యంత దారుణమైన ఫలితం. అలాగే, ఈశాన్య రాష్ట్రం మెక్లెన్‌బర్గ్-వెస్టర్న్ పోమెరేనియాలో ఎఎఫ్‌డి 38.2శాతం ఓట్లతో స్పష్టమైన విజయం సాధించింది. ఎస్‌పిడి 35.5శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. మెర్జ్ పార్టీ సిడియు కేవలం 4.9శాతం ఓట్లు మాత్రమే సాధించి, తన ఎనిమిది దశాబ్దాల చరిత్రలో అత్యంత ఘోర పరాజయాన్ని చవిచూసింది. సీట్లు గెలవడానికి అవసరమైన 5శాతం కనీస ఓట్ల పరిమితిని కూడా అందుకోలేకపోయింది.

**చారిత్రాత్మక విజయం : ఎంఎ బేబీ**

జర్మనీలోని బెర్లిన్ రాష్ట్ర ఎన్నికల్లో వామపక్ష పార్టీ డై లింకె సాధించిన చారిత్రక విజయంపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన స్పందిస్తూ, "న్యూయార్క్ నుంచి బెర్లిన్ వరకు సోషలిస్ట్ ప్రత్యామ్నాయం విజయం సాధిస్తోంది!" అని పేర్కొన్నారు. డై లింకె పార్టీని చారిత్రక విజయం వైపు నడిపించిన ఎలిఫ్ ఎరాల్ప్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేసిన బేబీ, గృహ హక్కులు, సామాజిక న్యాయం, ఆత్మ గౌరవంపై ఆమె ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సంప్రదాయవాద పాలనకు వ్యతిరేకంగా బెర్లిన్ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు, మితవాద శక్తులను వెనక్కి నెట్టడంలో నిర్దిష్ట కార్యక్రమ వ్యూహం సఫలం కాగలదని రుజువు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మికరాజ్య రాజకీయాలను అనుసరించే వారందరికీ ఈ విజయం స్ఫూర్తినిస్తుందని పేర్కొన్న బేబీ, శ్రామిక ప్రజలకు మరింత శక్తి చేకూరాలని ఆకాంక్షించారు.

**ఎవరు ఈ ఎరాల్ప్..**

టర్కీలో వామపక్ష రాజకీయాలు, కార్మిక సంఘాల్లో చురుగ్గా పనిచేసిన ఎరాల్ప్ తల్లిదండ్రులు, 1980 సైనిక తిరుగుబాటు తర్వాత జర్మనీకి వలస వచ్చారు. ఆ సమయంలో ఆమె తల్లి ఎనిమిది నెలల గర్భవతి. మ్యూనిచ్‌లో జన్మించిన ఎరాల్ప్, హాంబర్గ్‌లో న్యాయశాస్త్రం చదివి, తర్వాత వలసదారుల హక్కుల కోసం పనిచేశారు. 2010లో జర్మన్ పార్లమెంట్‌లో డై లింకె బృందానికి సిబ్బందిగా చేరిన ఆమె, ఆ తర్వాత శాశ్వతంగా బెర్లిన్‌కు మారారు.

ప్రస్తుతం ఆమె భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ప్రముఖ క్రాయిట్జ్‌బర్గ్ ప్రాంతంలో నివసిస్తు న్నారు. ఈ ఫలితాల అనంతరం, ఎఎఫ్‌డి జాతీయ సహ-నేత టీనో క్రుపల్లా, ఛాన్సలర్ మెర్జ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫలితాలు "విపత్తు"గా మెర్జ్ అభివర్ణించినప్పటికీ, తన పదవిలో కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు.

## మెప్మా కార్యకలాపాలపై సమీక్ష

**- ఆర్‌పీలకు కీలక సూచనలు - మున్సిపల్ కార్యాలయంలో జిల్లా పీడీ వెంకట దాస్ సమావేశం**



**డోన్ -సూర్య వాస్తవం :** డోన్ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్‌పీలతో నంద్యాల జిల్లా మెప్మా పీడీ వెంకట దాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు యాప్ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. పీడీ వెంకట దాస్ మాట్లాడుతూ.. మెప్మా పరిధిలోని ఆర్‌పీలు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సేవలు, అవకాశాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే , ఎండిఎంఎల్, ఎం సి పి, కార్యక్రమాల పురోగతి, యాప్‌లో రిజిస్ట్రేషన్, వివరాల నమోదు, డేటా అప్‌డేట్ తదితర అంశాలపై ఆర్‌పీలకు పీడీ వివరించారు. యాప్‌లో అవసరమైన సమాచారాన్ని సక్రమంగా నమోదు చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడం,సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం, సభ్యులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా డోన్ మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న ప్రత్యేక ప్రాజెక్టులు, పీఎం సేవా నిధి పథకం అమలు, సంబంధిత విభాగాల సమన్వయం తదితర అంశాలను వివరించారు. మెప్మా కార్యక్రమాలను పట్టణ ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం అక్షర ఆంధ్ర డిప్యూటీ డైరెక్టర్ శ్రీ చంద్రశేఖర్ రెడ్డి కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై వివరాలు అందించారు. సూపర్‌వైజర్ ఫయాజ్ కూడా సంబంధిత కార్యకలాపాల పురోగతిని వివరించారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా మెప్మా పీడీ వెంకట దాస్ , డోన్ మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి , అక్షర ఆంధ్ర డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డి ఆర్ పి వేమా రెడ్డి , సి .ఓ సువర్ణమ, కంప్యూటర్ ఆపరేటర్ జావీద్ మెప్మా ఆర్‌పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని, ప్రజలను కూటమి ప్రభుత్వాలు ఆదుకోవాలి

**- రెండవ రోజు నిరవధిక రిలే నిరాహారదీక్షపై తహశీల్దార్‌కు వినతిపత్రం వామపక్షాల డిమాండ్**





**పామిడి - సూర్య వాస్తవం :** జిల్లాను జాతీయ కరువువిపత్తు జిల్లాగా ప్రకటించి, కరువు పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిల్లా రైతాంగాన్ని, ప్రజలను కూటమి ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని మండల వామపక్ష పార్టీలు రెండవ రోజు నిరవధిక రిలే నిరాహార దీక్షలో డిమాండ్ చేసాయి. మంగళవారం ఎద్దులపల్లి రోడ్డులోని అంబేద్కర్ సర్కిల్లో వామపక్షపార్టీల ఆధ్వర్యంలో రెండవ రోజు సామూహిక నిరువదిక రిలేనిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిరవధిక రిలేదీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా తగిన వర్షాలు లేకపోవడంతో రైతులు, ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో అనంతపురంజిల్లా కరువు పరిస్థితులతో తీవ్ర స్థాయిలో కూరుక పోయిందని ,పంటలు సాగు చేసిన రైతులు, వర్షం సరిగా లేక ఎంపిఆర్ డ్యాం నీరు అందక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కరువు ప్రభావంతో వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, పంట పొలాలు ఎండిపోవడమే గాక రైతులకు సాగునీరు, తాగునీరు, పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం వంటి సమస్యలు తీవ్ర దుర్భర స్థితికి చేరుకున్నట్లు వారు ఆవేదన వ్యక్తపరిచారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి,అనంతపురం జిల్లాను జాతీయ కరువు విపత్తు జిల్లాగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కరువు కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించడంతో పాటు, పంట నష్టపరిహారం, రెండు లక్షల రూపాయలు రుణ ఉపశమనం, సాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ముఖ్య నాయకులు కే.రహీం, అనిమిరెడ్డి, గజ్జల దస్తగిరి, మల్లేష్, కోదండరామిరెడ్డి, ఓబయ్య తదితరులు తహసిల్దార్ షర్మిలకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాలు చర్యలు తీసుకోని ఎడల నిరాహార దీక్షలు ధర్నాలు ర్యాలీలు రాస్తారోకోలు లాంటి ఆందోళన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. 22న వామపక్షాల ఆధ్వర్యంలో పకీరప్ప వెంకటేశ్వర్లు ఎర్రి స్వామి సుంకన్న సారంబి హుస్సేన్ బి సూర్యనారాయణరెడ్డి శివ ఓబులేష్ తదితరులు నిరవధిక రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు రహీం, అనిమిరెడ్డి, గజ్జల దస్తగిరి, నాగరాజు,ముత్యాలు,చౌడప్ప, ఓంకార్, సూర్యనారాయణరెడ్డి, ఓబయ్య, రాముడు, ఇమాము, శివ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

## కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్‌కు (క్యాప్కో) కీలక గుర్తింపు...!

**- పిడిఎస్, ఆహార భద్రత, నిత్యావసరాల సరఫరాపై వినియోగదారుల సంఘాల సూచనలు**
**- వినియోగదారుల హక్కుల పరిరక్షణకు క్యాప్కో పూర్తి సహకారం**
**- కమిషనర్ కె.కన్నబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపిన క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్**

**విజయవాడ - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ప్రత్యేక ఆహ్వానితులుగా చేర్చుతూ ప్రభుత్వం సెప్టెంబర్ 21, 2026న ఉత్తర్వులు జారీ చేయడాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ (క్యాప్కో) స్వాగతించింది. ఈ సందర్భంగా క్యాప్కో చైర్మన్ జి. సురేష్ కుమార్ సోమవారం సాయంత్రం విజయవాడలోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో 12 మంది వినియోగదారుల సంఘాల ప్రతినిధులను ప్రత్యేక ఆహ్వానితులుగా నామినేట్ చేయడం అభినందనీయమని సురేష్ కుమార్ పేర్కొన్నారు. వినియోగదారుల సంఘాలకు కమిటీలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా వినియోగదారుల భాగస్వామ్యం, పారదర్శకత మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, నిత్యావసర వస్తువుల సరఫరా, ఆహార భద్రత, వినియోగదారుల ఫిర్యాదులు, అక్రమాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో వినియోగదారుల సంఘాలకు ఉన్న అనుభవం కమిటీకి ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల పాత్రను గుర్తించి రాష్ట్ర స్థాయి విజిలెన్స్ వ్యవస్థలో వారికి భాగస్వామ్యం కల్పించినందుకు కమిషనర్ కె. కన్నబాబుకు క్యాప్కో తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సురేష్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ఆహార భద్రత, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం, వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు క్యాప్కో పూర్తి సహకారం, నిర్మాణాత్మక సూచనలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వినియోగదారుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి...!

**- రైతులను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి**
**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్**



**ఉరవకొండ టౌన్ - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. జగదీష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండలో ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యం లో రైతులను ఆదుకోవాలని కోరుతూ చేపట్టిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులపై శాస్త్రవేత్తలు ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. అనంతపురం జిల్లాలో 50 శాతం కూడా సాగు జరగ లేదని, సాగు చేసిన పంటలు సైతం ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గతంలో కరువు సమయంలో మండల కేంద్రాల్లో గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి పశువులను ఆదుకోవడంతోపాటు ప్రత్యామ్నాయ విత్తనాలు అందించేవారని, ప్రస్తుతం అలాంటి చర్యలు కనిపించడం లేదన్నారు. హంద్రీ--నీవా కాలువ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ పిల్ల కాలువలు లేకపోవడంతో రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలగడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చి వాటిని సమగ్ర అభివృద్ధికి వినియోగించకుండా అమరావతి రాజధాని నిర్మాణానికే అధికంగా ఖర్చు చేస్తోందని, రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగు తోందని డి. జగదీష్ ఆరోపించారు. రాయలసీమ ప్రాంతాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతపురం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతుల రుణాలు మాఫీ చేయాలని, పంట నష్టపరిహారం, పంటల బీమా పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి పశువులను, వ్యవసాయ కూలీలను ఉపాధి పనులు పెంచి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ దీక్షకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు అధ్యక్షత వహించగా వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ వెలుగొండ నరసింహులు, అశోక్ కుమార్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేశవరెడ్డి, ఆ పార్టీ నాయకులు సుల్తాన్ బసవరాజు, మల్లేష్, ప్రసాద్, హనుమంతు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోనియా సీన, నాయకులు సుధాకర్, హెచ్ ఖాన్, రమేష్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఈడిగ ప్రసాద్, కొడికి గోవిందు, వన్నూరు సాహెబ్, మాజీ సర్పంచ్ జగదీష్, డిష్ సురేష్, సీపీఐ మహిళా సంఘం నాయకులు నూర్జ హాన్, సంజమ్మ, వన్నూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కరువు పరిస్థితులపై రెండవ రోజు సామూహిక దీక్షలు

**- సీపీఐ, సిపిఎం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, అఖిల భారత రైతు కూలీ సంఘం**
**- గుత్తి ఎమ్మార్వో, కార్యాల యం ఎదుట రెండవ రోజు సామూహిక దీక్షలు**



**గుత్తి - సూర్య వాస్తవం :** కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతు ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుత్తి,ఎమ్మార్వో కా ర్యాలయం ఎదుట చేపట్టిన సామూహిక దీక్షలు మంగళ వారం రెండవ రోజు కొనసా గాయి. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, అఖిల భారత రైతు కూలీ,సంఘాల నాయకులు మాట్లాడుతూ కరువు పరిస్థి తులపై కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించి రైతులను ఆదుకో వాలని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు:** అనంతపురం జిల్లాను కరు వు జాతీయ విపత్తుగా జిల్లా గా ప్రకటించి. కేంద్ర రాష్ట్ర ప్ర భుత్వం అనంతపురం జిల్లా లో ఉన్న రైతులను ఆదుకో వాలి. కరువు ప్రాంత విద్యా ర్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలి. గ్రామీణ ప్రాం తాల్లో అవసరం ఉన్న ప్రతి గ్రామంలో మంచినీటి సౌక ర్యం ఏర్పాటు చేయాలి. ప శు వులకు ప్రతి మండలంలో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కరువు ప్రాంత రై తులకు అన్ని రకాల బ్యాం కు రుణాలను రద్దు చేయా లి. గ్రామీణ ప్రాంత కూలీలకు పనులు లేకుండా ఉన్నప్పు డు ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ.700 చొప్పున కూలి చెల్లించి ప నులు కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న,సన్నకారు రైతులకు కరువు పింఛన్‌గా రూ.10,000 చెల్లించాలి. పంట నష్టపరిహారం ఇబ్బం దులు లేకుండా ప్రతి పంట కు నష్టపరిహారం అందించాలి. గతంలో ఇచ్చిన హామీల ను అమలు చేసి అన్ని చెరు వులకు,కుంటలకు,చెక్ డ్యా మ్ లకు నీరు అందించాలి. రైతుల సమస్యలను ప్రభు త్వం వెంటనే పరిష్కరించా లని,కరువు పరిస్థితుల్లో రైతులు,వ్యవసాయ కూలీ లను ఆదుకోవాలని నాయ కులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, నియోజకవర్గం సీనియర్ నాయకులు, రమేష్ బాబు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు, వెంకటరాముడు,పట్టణ సహాయ కార్యదర్శి, నజీర్,మహిళా సమైక్య ని యోజకవర్గ కార్యదర్శి,మ హమ్మద, కెవిపిఎస్, మండల కార్యదర్శి, మల్లికార్జున సీని యర్ నాయకులు, బి.రామ కృ ష్ణ, ఎస్ఎఫ్ఐ, మండల కార్యదర్శి, నవీన్ యాదవ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుత్తి టౌన్ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు హుస్సేన్ పీర, రాష్ట్ర రైతు విభాగశీ కార్యదర్శి, మల్లయ్య యాదవ్, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురా లు, చంద్రగిరి రాధాయాదవ్, నియోజవర్గ మహిళ అధ్య క్షురాలు బిందె వరలక్ష్మి,బిం దె గురు ప్రసాద్ యాదవ్, శ్రీ దేవి, అఖిల భారత రైతు కూలీ సంఘం, జిల్లా సహాయ కార్యదర్శి, రామాంజనేయులు, మండల కార్యదర్శి, దనుంజయ, నజీర్, సురేశ్, బెస్తశివకుమార్, సీనియర్ నాయకులు, టియం, బాషా, డప్పు కళాకారుల ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు..



## కూచిపూడి నృత్యంలో విశేషప్రతిభ కనబరచిన 'శ్రీ విద్యాలయం' హైస్కూల్ విద్యార్థిని



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 20న నిర్వహించిన నృత్య ప్రదర్శనలో మన గుత్తికి చెందిన హెచ్.సహస్ర కూచిపూడి నృత్యంలో విశేషా ప్ర తిభ కనబరచి దేవస్థానం వారిచే ప్రశంసా పత్రం పొందింది. ఈ అమ్మాయి అరవింద్ ఆర్ట్సుఅకాడమీ సురేష్ మాస్టర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతుంది. ప్రస్తుతం ఈ బాలిక శ్రీ వి ద్యాలయం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కడప జిల్లా గోపాలపురంలో 7వ తరగతి చదువుతుంది. ఈ సం దర్భంగా విద్యార్థినినీ పాఠశాల ఉ పాధ్యాయులు, విద్యార్థు లు మరియు బంధుమిత్రులు అభినందించారు.

## ఎమ్మెల్సీ రమాదేవి, వడ్డే వెంకటనారాయణ ఆత్మీయ అభినందన సభలో పాల్గొన్న ఆర్కే రవి ఆనంద్



**పామిడి - సూర్య వాస్తవం :** జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎమ్మెల్సీ వడ్డే రమాదేవి, వడ్డే వెంకటనారాయణల ఆత్మీయ అభినందన సభలో ముఖ్య అతిథులుగా మండల టిడిపి సీనియర్ నాయకులు వడ్డే ఆనంద్ ఆర్కే రవిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వడ్డే కులస్తులకు అన్ని రంగాలలో సముచిత న్యాయం చేకూర్చాలని జిల్లాలోని గాక రాష్ట్రవ్యాప్తంగా వడ్డేర్లు అత్యధిక శాతం తెలుగుదేశం పార్టీ వెనువెంటనే నడుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు వడ్డే కార్పొరేషన్ చైర్మన్ మల్ల ఈశ్వర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఫీట్లచిరంజీవి, నంద్యాల జిల్లా బాలనరసింహుడు, సుదర్శన్ బాబు,ఆర్కే రవి, రాముడు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

### - ఎమ్మెల్యే గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం మున్సిపాలిటీ అర్బన్ చాలెంజ్ ఫండ్ 19 కోట్ల రూపాయల తో భూమి పూజ మరియు శంకుస్థా పన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుంతకల్లుని యోజకవర్గం శాసనసభ్యుల గుమ్మనూరు జయ రాం తనయుడు గుత్తి మరియు పా మిడి మండలాల ఇంచార్జ్ యువనే త గుమ్మనూరు ఈశ్వర్ ముందుగా యు వనేత ఈశ్వర్ కి గుత్తి పట్టణ మరియు మండల కూటమి నాయ కులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.అనంతరం అక్కడ ఏర్పా టు చేసిన 19 కోట్ల రూపాయల తో భూమి పూజ మరియు శంకుస్థాపన చేయడం జరిగినది అనంతరం ఈ శ్వర్ మాట్లాడుతూ తాగునీటి వ్య వస్థ బలోపేతం పట్టణంలోని వార్డు లలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగు నీరు అందించేలా పైప్‌లైన్‌ల నిర్మా ణం మరియు నిల్వ ట్యాంకుల ఆధు నీకరణ? అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డము రుగు నీటి కాలువలు పట్టణంలో డ్రై నేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సిసి డ్రెయిన్లు, మురుగునీటి వ్యవస్థ నిర్మా ణం ?బిటి మరియు సీసీ రోడ్ల నిర్మా ణం ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రధాన రహదారులు అం తర్గత వీధుల్లో కొత్త రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతులు ?పట్టణ అం దాలీకరణ అండ్ ఎల్ఈడీ వీధిదీపాలు వీధిదీపాల ఏర్పాటుతో పాటు కీలక కూడళ్ల ఆధునీకరణ ప్రకటన గుత్తి పట్టణాన్ని అన్ని రంగాల్లో మోడల్ గుత్తి మున్సిపాలిటీ గా తీర్చిదిద్దడ మే మా ధ్యేయం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా విడుదలైన రూ.19 కో ట్ల నిధులతో పట్టణ రూపు రేఖలు మారబోతున్నాయి గత కొంతకాలంగా ఉన్న తాగునీరు రోడ్లు డ్రైనేజీ స మస్యలకు ఈ పనుల ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీ త గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీ సుకురావాలని సంబంధిత కాంట్రా క్టర్లు అధికారులను ఆదేశించడం జ రిగింది. ఈ కార్యక్రమంలో గుత్తి మున్సిపాలిటీ అధికారులు గుత్తి పట్టణం, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## హెచ్ఏఎం పథకం కింద నగరంలో

# రూ.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం...!

- తాగునీరు, మురుగునీటి శుద్ధి, రోడ్లు, డ్రైనేజీలకు భారీగా నిధులు
- గత ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థ నిధులు పక్కదారి పట్టించారని ఆరోపణ
- డంపింగ్ యార్డ్ రోడ్ల నిర్మాణాలపై వైసీపీ నేతలను ప్రశ్నించిన ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) పథకం కింద అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో రూ.50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఏఎం పథకం కింద రూ.11,359 కోట్ల విలువైన పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా అనంతపురం మున్సిపల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అనంతపురం నగరంలో రూ.1,300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఓల్డ్‌టౌన్‌తో పాటు నగరంలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించడంతో పాటు మురుగునీటి శుద్ధి కోసం రూ.107.71 కోట్లతో శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తాజాగా మంజూరైన రూ.50 కోట్లతో రోడ్లు, పార్కులు, డివైడర్లు, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే నెలలో రూ.160 కోట్లతో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థకు వచ్చే నిధులను పక్కదారి పట్టించారని దగ్గుపాటి ప్రసాద్ ఆరోపించారు. గత ఐదేళ్లలో నగరంలో చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. వాస్తవాలను ప్రస్తావిస్తే మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గతంలో డంపింగ్ యార్డు, రోడ్ల నిర్మాణాల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని వైసీపీ నేతలపై ఆరోపణలు చేశారు. నగరంలోని 62 డివిజన్లతో పాటు నాలుగు పంచాయతీల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుంటే వైసీపీ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. విజయవాడలో ఉపాధ్యాయులపై జరిగిన దాడి ఘటనను ఆయన ఖండించారు. ఉపాధ్యాయులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ జిల్లా బెస్త సంఘం అధ్యక్షుడు చేపల హరి తదితర టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# రూ.253 కోట్లతో రాయదుర్గం అభివృద్ధి

- ప్రజల రుణం తీర్చుకోవడమే నా బాధ్యత...
- ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధికి బాటలు వేస్తున్న కూటమి ప్రభుత్వం..
- ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ నిధులు సమీకరించి అభివృద్ధి పనులు చేపట్టాం: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం- సూర్య వాస్తవం :** ఎక్కడ అవకాశం ఉంటే అక్కడి నుంచి నిధులు సమీకరించి రూ.253 కోట్లతో రాయదుర్గం పట్టణ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. గత రెండేళ్లలో ఎన్నడూ లేనంతగా పట్టణంలో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. అభివృద్ధిని చూసి ప్రజలు తమను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. రాయదుర్గం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద రూ.30 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ...

గత ఎన్నికల్లో రాయదుర్గం పట్టణ ప్రజలు తనను 16 వేలకుపైగా మెజారిటీతో గెలిపించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తనపై ఇంతటి ఆదరణ చూపిన ప్రజలకు పట్టణ అభివృద్ధి కోసం తాను ఎంత చేసినా తక్కువేనని అన్నారు. తనకు సాధ్యమైనంత మేరకు, అవకాశం ఉన్న ప్రతి చోట నిధులు సమీకరించి గత రెండేళ్లలో పట్టణ అభివృద్ధికి కీలకమైన పనులు చేపట్టామని వివరించారు. దశాబ్దాల తరబడి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న రాయదుర్గం పట్టణాన్ని రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలకు సమానంగా అభివృద్ధి చేస్తూ కొత్త పుంతలు తొక్కిస్తున్నామని తెలిపారు. గత రెండేళ్ల కాలంలోనే రూ.253 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా రూ.30 కోట్ల పనులకు శంకుస్థాపన చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత రెండేళ్లలో జరిగినంత అభివృద్ధి రాయదుర్గం పట్టణంలో మునుపెన్నడూ జరగలేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, మంత్రి నారాయణ ముందుచూపుతో రాయదుర్గం పట్టణంలో మునుపెన్నడూ చూడని అభివృద్ధిని సాధించగలుగుతున్నామని తెలిపారు.

రాయదుర్గం పట్టణంలో రూ.78 కోట్ల వ్యయంతో అమృత్-2 పథకం కింద తాగునీటి పథకం విస్తరణ పనులు చేపట్టామని చెప్పారు. అలాగే హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా రూ.30 కోట్లతోపాటు మరో రూ.30 కోట్లను సమీకరించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని వివరించారు. వీటితో పాటు వివిధ పథకాల కింద నిధులు సమీకరించి రాయదుర్గం పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్వచ్ఛ భారత్ నిధులను తీసుకొచ్చి దశాబ్దాలుగా పేరుకుపోయిన సుమారు లక్ష టన్నుల చెత్తను శుద్ధి చేస్తున్నామని తెలిపారు. పట్టణ శివారు ప్రాంతాల్లో రూ.2.50కోట్ల వ్యయంతో నగరవనాన్ని అభివృద్ధి చేశామని, రాబోయే ఐదేళ్లలో మరో రూ.25 కోట్లు ఖర్చు చేసి మరింత మెరుగైన సౌకర్యాలతో తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. ఆగిపోయిన రైల్వే వంతెన నిర్మాణానికి రూ.46 కోట్లు మంజూరు చేయించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన టిడ్కో బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఐదేళ్లపాటు ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.27 కోట్లతో పనులు పునః ప్రారంభించామని చెప్పారు. అలాగే రూ.3 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించామని, వీటితోపాటు రోడ్లు, మురుగుకాలువల నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. మరో 20 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు వేస్తున్నామని వివరించారు. ప్రజలు సాయంత్రం వేళల్లో తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేందుకు వీలుగా పట్టణంలోని పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ నిధులు సమీకరించి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాయదుర్గం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరారు. ప్రజల ఆశీర్వాదమే తమను మరింత బలోపేతం చేస్తుందని, తద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లభిస్తుందన్నారు. ప్రజల ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ తమపై ఉండాలని, మరిన్ని గొప్ప పనులు చేయడానికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి,బీజేపీ పట్టణ అధ్యక్షుడు అంబోజి రావ్, వసుంధర దేవి, సెంట్రల్ స్టోర్ అధ్యక్షుడు పూజరి శివ, చేనేత మాజీ డైరెక్టర్ టశీకశాల హనుమంతు, బంగి శంకర్,పైతోట రామంజి, మోపురి అశోక్,సుమలత, ఉమ,ఎల్లప్ప, రావుత్ రాజశేజర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### తనకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి,

## రైతులకు కరువు సహాయక చర్యలు చేపట్టాలి: సీపీఐ

**తనకల్లు - సూర్య వాస్తవం :** మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ మండల కార్యదర్శి తెలిపారు. ఇటీవల కురిసిన అరకొర వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులు ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతులకు ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించాలని. తాసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. రైతులు సాగు చేసిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, పంటల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే వ్యవసాయ రుణాలను మాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలు అందించాలని, ఎరువులు, విత్తనాలను సకాలంలో సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, రెడ్డప్ప. రైతులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# పుట్టపర్తిలో కలకలం

**- తెల్లారితే పెళ్లి.. అంతలోనే రంగంలోకి అధికార్లు**

**- హుటాహుటిన గ్రామానికి బయలుదేరిన అధికారుల బృందం**



**శ్రీ సత్యసాయి జిల్లా- సూర్య వాస్తవం :** శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రానికి సమీప గ్రామంలోని ఓ ఆలయంలో బాల్య వివాహానికి ఏర్పాట్లు జరగడం కలకలం రేపుతోంది. ఇంటర్ చదువుతున్న ఓ బాలిక(17)కు అదే గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువకుడితో పెళ్లి కుదిరిందని సమాచారం. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయంలో వివాహ తంతు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అయితే అమ్మాయి మైనర్ కావడంతో అజ్ఞాత వ్యక్తి చైల్డ్ లైన్ 1098కు మంగళవారం రాత్రి 9 గంటలకు సమాచారం అందించారు. ఐసీడీఎస్ పుట్టపర్తి మండల సూపర్ వైజర్ అయ్యగారి రజిత దృష్టికి విషయం రాగానే ఆమె ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచనల మేరకు పోలీసులు, వీ.ఆర్.ఓ కు సమాచారం అందించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ రజిత, పుట్టపర్తి రూరల్ ఎస్.ఐ, వీ.ఆర్.ఓ సహా చైల్డ్ లైన్ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి రాత్రి 11 గంటలకు గ్రామానికి చేరుకున్నారు. పెళ్లి పీటలెక్కనున్న మైనర్ అమ్మాయి సహా పెళ్లి కొడుకును తమ కస్టడీలోకి తీసుకొని, రెండు కుటుంబాల వారికి కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు. ఈ విషయం పుట్టపర్తి పరిసర గ్రామాలలో చర్చనీయాంశమైంది.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన... పీఆర్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు...!

**- పీఆర్ ఇంజినీర్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన లక్ష్మీనారాయణ**



**అనంతపురం - సూర్య వాస్తవం :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు, పీఆర్ సబ్ డివిజన్--1 డీఈఈ కె. లక్ష్మీనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. రాప్తాడు మండల పర్యటనకు మంగళవారం వచ్చిన మంత్రి నారా లోకేష్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి ఆయన కలిశారు. ఈ సందర్భంగా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిని లక్ష్మీనారాయణ మంత్రికి వివరించారు.

# వైభవంగా గౌడ సముద్ర మారెమ్మ జాతర

**- నోటి గుండా ఇనుప కడ్డీ దూర్చుకున్న పూజారి..**

**- ముళ్ల కంపలపై సాహస పూజ**





**బెళుగుప్ప- సూర్య వాస్తవం :** బెళుగుప్ప మండల పరిధిలోని బెళుగుప్ప తాండాలో వెలసిన శ్రీ గౌడ సముద్ర మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతరలో భాగంగా పూజారి నోటిలో ఇనుప కడ్డీని దూర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముళ్ల కంపలపై నిలబడి సంప్రదాయ ఆచారాలను కొనసాగించారు. ఈ దృశ్యాలను చూసిన భక్తులు అమ్మవారిని స్మరిస్తూ జయజయధ్వానాలు చేశారు. అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు బెళుగుప్ప తాండాతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో తాండా పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి నామస్మరణలు, పూజా కార్యక్రమాలతో తాండా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించు కుంది. ప్రతి ఏడాది నిర్వహించే ఈ జాతరలో స్థానిక సంప్రదాయాలు, ఆచారాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# ఏం బాషా భాయ్... కైసే హో....!

**- ఐఎంఎం భాషను ప్రేమతో పలకరించిన నారా లోకేష్**

**- అనంతపురం అర్బన్ మేయర్ పదవిపై బాషా విజ్ఞప్తి**

**- కష్టపడే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్న నారా లోకేష్**



**అనంతపురం - సూర్య వాస్తవం :** రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ నాయకుడు ఐఎంఎం మహబూబ్ బాషా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ తనను చూడగానే "బాగున్నావా బాషా" అంటూ ఆప్యాయంగా పలకరించారని మహబూబ్ బాషా తెలిపారు. తన పేరుతో పలకరించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. తాను దాదాపు 30 ఏళ్లుగా టీడీపీలో చురుగ్గా పని చేస్తున్నట్లు లోకేష్‌కు వివరించినట్లు చెప్పారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని లోకేష్ తెలిపినట్లు మహబూబ్ బాషా పేర్కొన్నారు. అనంతపురం అర్బన్‌లో ముస్లింలు, బలిజ సామాజికవర్గం గణనీయంగా ఉన్నందున ఈసారి మేయర్ పదవి విషయంలో ముస్లిం, బలిజ వర్గాలకు అవకాశం కల్పించాలని లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై లోకేష్ నవ్వుతూ పరిశీలిస్తానని చెప్పినట్లు మహబూబ్ బాషా వివరించారు. అనంతరం టీడీపీ జోనల్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి పరిచయం చేసుకున్నారు. తన పేరు ఐఎంఎం మహబూబ్ బాషా అని చెప్పగానే ఆప్యాయంగా పలకరించారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన సూచించినట్లు మహబూబ్ బాషా తెలిపారు. త్వరలో మరోసారి అందరం కలిసి మాట్లాడుకుందామని శ్రీనివాస్ రెడ్డి చెప్పినట్లు పేర్కొన్నారు.



# పేద కుటుంబం నుంచి అండర్-19 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక

**- వయోజన విద్యాశాఖ తరపున ప్రోత్సాహకంగా రూ.1.39 లక్షల చెక్కు అందజేత**

**- కిరణ్‌కుమార్‌ను అభినందించిన కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాకు చెందిన తలారి కిరణ్‌కుమార్ అండర్--19 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కిరణ్‌కుమార్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. కిరణ్‌కుమార్ తల్లి లక్ష్మీ ప్రసన్న వయోజన విద్యాశాఖలో అవుట్‌సోర్సింగ్ విధానంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. కిరణ్‌కుమార్ భవిష్యత్తుకు పేదరికం ఆటంకంగా మారకుండా వయోజన విద్యాశాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తామని ఆ శాఖ ఉపసంచాలకులు ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో భాగంగా కిరణ్‌కుమార్‌ను ప్రోత్సహించేందుకు ఉపసంచాలకులు, సిబ్బంది కలిసి సేకరించిన రూ. 1,39,000ల చెక్కును కలెక్టర్ ఓ.ఆనంద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ సిబ్బంది చూపిన దాతృత్వాన్ని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బీవీ. భాస్కర్‌రెడ్డి, సిబ్బంది జనార్దన్ గౌడ్, సూర్యనారాయణ, రెక్కమాను సుధాకర్, గొల్ల రవి శ్రీధర్, పరమేశరప్ప, రమణ, గణేష్, ప్రభాకర్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర్లకు అండగా టీడీపీ ప్రభుత్వం...!

**- బీసీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**- వడ్డెర్లను గుర్తించిన ఏకైక పార్టీ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** బీసీలకు గతంలో న్యాయం చేసింది, భవిష్యత్తులోనూ న్యాయం చేసేది తెలుగుదేశం పార్టీయేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డెర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెర సోదరులకు శుభాకాంక్షలు తెలిపి, ఇటీవల ఎమ్మెల్సీగా నియమితులైన దళవాయి రమాదేవిని ఘనంగా సత్కరించారు. తన రాజకీయ ప్రయాణంలో వడ్డెర సమాజం అందించిన సహకారం మరువలేనిదని దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురానికి కొత్తగా వచ్చిన సమయంలో తనను ఆదరించిన వారిలో వడ్డెర్లు కూడా ఉన్నారని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధిలో వడ్డెర సమాజం కీలక పాత్ర పోషిస్తోందని, రోడ్లు, భవనాలు, చెరువులు, కాలువలు, రాయి పనులు, నిర్మాణ రంగం తదితర విభాగాల్లో వడ్డెరలు తమ శ్రమతో గణనీయమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం వడ్డెర్ల సంప్రదాయ వృత్తిని గుర్తించి ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. క్వారీ రంగంలో వడ్డెర్లకు 33 శాతం ప్రత్యేక కేటాయింపు ద్వారా సంప్రదాయ వృత్తికి ఆర్థిక బలం చేకూర్చే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఆదరణ--3 ద్వారా ఆధునిక పనిముట్లు, యంత్రాలు అందించడంతో పాటు బీసీ యువతను స్వయం ఉపాధి, ఎంఎస్ఎంఈ రంగాల వైపు ప్రోత్సహించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వడ్డెర పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఇంజనీర్లు, వైద్యులు, ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వడ్డెర సమాజం రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో వడ్డెర సమాజానికి ఇచ్చిన మాట ప్రకారం వడ్డెర ఆడబిడ్డ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి కల్పించామని దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని పేర్కొంటూ, బీసీల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, టీడీపీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు.

# ఘనంగా గ్యార్మీ పండుగ గంధం వేడుకలు

**- కులమతాలకు అతీతంగా పాల్గొన్న ప్రజలు**

**- స్వామివారికి చక్కెర చదివింపులు సమర్పించిన భక్తులు**

**- ప్రతిఏటా సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహిస్తున్న ముస్తఫా ఖాన్, స్థానికులు**



**అనంతపురం - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో గ్యార్మీ పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అనంతపురం ముస్తఫా ఖాన్, చెర్లోపల్లి స్థానికులు ప్రతిఏటా ఈ పండుగను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. చెర్లోపల్లి వీధుల నుంచి స్వామివారిని పట్టణంలోని ప్రధాన ప్రాంతం వరకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి చక్కెర చదివింపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో కులమతాల భేదాలు లేకుండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మతాలకు అతీతంగా, ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా అందరూ కలిసి పండుగను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పరస్పర సోదరభావం, ఐక్యతను చాటుతూ వేడుకలు ప్రశాంతంగా కొనసాగాయి.

# మున్సిపల్ షాపులు, రూముల అద్దెల బకాయిలు, ఇంటి పన్నులు, నీటి ఛార్జీలు వెంటనే చెల్లించాలి



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పురపాలక సంఘ పరిధిలో ఉన్న నివాస వున్న పట్టణ ప్రజలకు, పట్టణంలోని మున్సిపల్ షాపు రూములలో వ్యాపారం చేయుచున్న వ్యాపారస్థులకు తేలియ చేయడ మేమనగా మున్సి పాలిటీ వారికి చెల్లించవలసిన ఇంటి పన్నులు, నీటి ఛార్జీలు, ఖాళీజాగా పన్నులు, మున్సిపల్ షాపు రూములలో నెలసరి బాడుగ పై బకాయికి ఉన్న షాపు రూముల అద్దెలను వెంటేనే చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడవలసినదిగా తెలియచేయుడ మైనది. అట్లు చెల్లించ ని వారిపై మున్సిపాలిటీ చట్టం మేర కు చర్యలు తీసుకొనబడును. మరియు మున్సిపల్ షాపు రూముల అ ద్దెలను బకాయి ఉన్న యజమాను లు వెంటేనే చెల్లించవలసి నదిగాను, అట్లు చెల్లించని షాపు రూము లలీ జును రద్దు పరచి తిరిగి బహిరంగ వేలము వేసి వేరొకరికి కేటాయించ బడునని మరియు అద్దె బకాయిలు ఉన్న వారిశీదరికి మున్సిపాలిటీ చట్టము మేరకు వసూలు చేయబడు నని తెలియచేయుడమైనది. పట్టణములో వ్యాపారం నిర్వహిస్తునా వారికి తెలియచేయుడమేమనగా వాహన యాజ మానుల కాకుండా సరుకులు అమ్మకానికి తెచ్చు కొనే ట్రేడర్ వారితో మాత్రమే సుంకము వసూలు చేయవలసిన దిగా దినసరి కూరగాయుల మార్కెట్ కాంట్రాక్టర్ వారికి తెలియచేశారు. ఇందులకు బిన్నముగా వసూలు చేసిన ఎడల లీజును రద్దు చేయబడునని కమీషనర్ యన్.సురేంద్ర ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు.

# యశోదమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించిన వైసిపి యువనేత మంజునాథ్ రెడ్డి

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని వైయస్సార్సీపి మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి తల్లి యశోదమ్మ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న వైసీపీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వెంకటరామిరెడ్డి అల్లుడు వైసిపి యువనేత సీబీ.మంజునాథరెడ్డి స్థానిక పట్టణంలోని సరస్వతి విద్యా మందిరం దగ్గర ఉన్న కృష్ణారెడ్డి నివాసంకు వెళ్లి యశోదమ్మ పార్థివా దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలపటం జరిగింది.వారితో పాటు వైస్సార్సీపీ జిల్లా కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ కన్వీనర్ నారూర్ ఈశ్వరరెడ్డి,కత్రిమల మాజీ సర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, కొత్తపల్లి సూరి, పార్థసారథిరెడ్డి, మహేశ్వరరెడ్డి, చిరు, పార్వతీశ్వరరెడ్డి, భాస్కరరెడ్డి, సాగర్ రెడ్డి, రామచంద్రరెడ్డి, రంగం వెంకటేష్, పుంజా నాగేష్, రంగనాయకులు, తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.



# ప్రజలకు ఆధునిక వైద్యం సాంకేతికతను చేరువ చేస్తున్నా..

**- "మంత్రి సత్య కుమార్ యాదవ్"**







**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** గుంటూరు జిజిహెచ్ నాటకో సెంటర్‌లో ఏర్పాటు చేసిన గేనామిక్స్ సొల్యూషన్ సెంటర్‌ను ప్రారంభించిన రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా జన్యుపరమైన వ్యాధులను ముందుగానే గుర్తించడం,కుటుంబాల్లో వ్యాధి ప్రమాదాలను అంచనా వేయడం,వ్యాధుల నిర్ధారణను మరింత కచ్చితంగా చేయడం, భవిష్యత్‌లో వ్యక్తిగత అవ సరాలకు అనుగుణంగా చికిత్స అందించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇప్పటివరకు ఇతర నగరాలకు పంపాల్సిన పరీక్షలను గుంటూరులోనే అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు ఆధునిక వైద్య సాంకేతి కతను చేరువ చేస్తున్నాం.ఎన్ సిడి,క్యాన్సర్ స్క్రీనింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ,4.27 కోట్ల లక్ష్య జనాభాలో ఇప్పటికే సుమారు 2.65 కోట్ల మందికి స్క్రీనింగ్ నిర్వహించగా,సుమారు 7,500 కొత్త క్యాన్సర్ కేసులను గుర్తించాం.క్యాన్సర్ చికిత్స కోసం ఐతీ. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 2019--24 మధ్య సుమారు రూ 2,200 కోట్లు,గత రెండేళ్లలోనే సుమారు రూ 1,500 కోట్లు ఖర్చు చేశాం. నివారణ, ముందస్తు గుర్తింపు,కచ్చితమైన నిర్ధారణ, నాణ్యమైన చికిత్స-ఈ నాలుగు అంశాలపై దృష్టి సారిస్తూ ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. అని ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

# రెండు నెలలుగా వెలగని వీధి దీపాలు..

**- స్పందించిన కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి కిరణ్**

**- 48 గంటల్లో లైట్లు వెలిగించాలని మండల ఏఓ కి కిరణ్ కుమార్ అల్టిమేటం**





**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:**సూళ్లూరుపేట మండలం ఆబాక గ్రామం గత రెండు నెల లుగా చిత్త చీకటిలో మగ్గి పోతోంది. సాయంత్రం చీకటి పడితే చాలు గ్రామంలో ఒక్క వీధి లైటు కూడా వెలగడం లేదు.దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రాత్రి వేళల్లో చిన్నపిల్లలు,మహిళలు వీధుల్లో తిరగాలంటేనే భయపడుతున్నారు.చీకటి కారణంగా పాములు,తేళ్లు,విషపురుగుల సంచారం విపరీతంగా పెరిగిందని,పిల్లల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు,సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డి.కిరణ్ కుమార్ వెంటనే స్పందించి వెంటనే ఆబాక గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధులన్నీ తిరిగి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.అనంతరం మండల ఏఓ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) కి వినతిపత్రం అందజేసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ"48 గంటల్లో ఆబాక గ్రామంలోని వీధి దీపాలన్నీ మరమ్మతు చేసి వెలిగించాలని అధికారులను కోరాము.చీకటి కారణంగా ఎలాంటి ప్రమాదం జరిగినా,పాము కాటుకు గురైనా దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి.ప్రజల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలి.లేనిపక్షంలో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతాము.ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నం బాకం హరికృష్ణ, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు జోగి వినోద్,సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కే.శ్వేత, దొరవారిసత్రం మండలం మహిళా అధ్యక్షురాలు ఎం.చాముండేశ్వరి,సూళ్లూరుపేట టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె యాసిన్ భాష, నియోజకవర్గ కార్యదర్శి బొగ్గుల సురేష్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్చార్జి కిరణ్

# చెరువు ఆక్రమణ.... సాగుకు సిద్ధం
# కను మరుగు కానున్న కల్లూరు కండ్రిగ చెరువు

**- గతంలో హెచ్చరిక బోర్డులను తొలగించి సాగుకు సిద్ధం చేస్తున్న ఆక్రమణదారులు- పట్టించుకోని సంబంధిత అధికారులు**



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యమో...ఇరిగేషన్ శాఖ వారి అలసత్వమో కానీ సాగు భూములకు నీరంధించే చెరువులో వాటి విస్తీర్ణం కోల్పోయి సాగు పొలాలుగా ఆక్రమణదారుల చెరలోకి చేరుతున్నాయి. దొరవారిసత్రం మండల పరిధిలోని సర్వే నంబర్ 27లో ని కల్లూరు కండ్రిగ చెరువు సుమారు 15 ఎకరాల పైబడి ఆక్రమణకు గురికావడంతో కనుమరుగయ్యే పరిస్థితికి చేరుతుంది.ఆ గ్రామంలో కొందరు ఆక్రమణదారులు చెరువునే సాగు పొలాలుగా ఆక్రమించి సాగు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.చెరువులో నేడుచుక్కనీరు లేక పోవడంతో చదునుగా ఉన్న చెరువు విస్తీర్ణంలో ఆక్రమించి గనుమలు వేసి వరి విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసి ఉన్నారు.వాగులు, వంకలు,నదులు,చెరువులను ఆక్రమించకూడదని, ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకోవచ్చనే చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలు చేయడంలో అధికారులకు వైఫల్యం చెందుతున్నారు.కల్లూరు కండ్రిగ చెరువు ఈ చర్యతో కనుమరుగై పంట పొలాలకు మారిపోయి, క్రింది సాగు నీటి ఆయకట్టు దారుల పొలాలకు అవసరమైన నీటి సామర్థ్యం నిల్వలు అవకాశం లేకుండా పోతుంది.చెరువులు ఆక్రమిస్తున్న ఆయా గ్రామాల చెరువుల ఆయకట్టు అధ్యక్షులు నిర్లక్ష్య ధోరణికి నిదర్శనంగా కనిపిస్తుంది చెరువుల భద్రత చేపట్టాల్సిన రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు సైతం ఆక్రమణలకు గురి కాకుండా చెరువులను కాపాడడంలో ఆ శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణికి నిదర్శనంగా కనిపిస్తోంది.స్థానిక వీఆర్వో,వీఆర్ఏలు కూడా చెరువులు ఆక్రమణకు గురవుతున్న చూసి చూడనట్లు వ్యవహరించడం ఏమిటని కూడా ఆ గ్రామ రైతులు కొందరు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు చెరువుల పరిరక్షణలో చర్యలు చేపట్టి, ఆక్రమణలతో, కనుమరుగు కానున్న సాగునీటి చెరువులను పరిరక్షించి వ్యవసాయానికి అవసరమైన నీటి సామర్థ్యం నిల్వలకు దోహదపడేలా చర్యలు చేపట్టాలని చెరువు నీటి ఆధారంతో వరి సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతల అభిప్రాయాలు ఉన్నాయి.

# ఎల్‌ఏ సాగరం ఎస్టీ కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణంలోని ఎల్‌ఏ సాగరం ఎస్టీ కాలనీలో విద్యుత్ స్తంభాల సమస్యకు పరిష్కారం లభించింది. ఇంటిం టికీ కూటమి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డోర్‌టుడోర్ కార్యక్రమం లో కాలనీ వాసులు రెండు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ విషయాన్ని వార్డు ఇన్‌చార్జి సయ్యద్ షరీఫ్,బూత్ కన్వీనర్లు ఇమానీ భాష, నాయుడుపేట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు 786 రఫీ దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన 786 రఫీ నాయుడు పేట విద్యుత్‌శాఖ ఏఈని కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు.దీంతో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం ఎల్‌ఏ సాగరం ఎస్టీ కాలనీలో నూతనంగా రెండు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.స్తంభాల ఏర్పాటుతో కాలనీ వాసుల విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది.తాము సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ,786 రఫీకి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

# వ్యక్తిగత విమర్శలు కాక..
# అభివృద్ధిపై చర్చిద్దాం: ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ

- **పట్టణాల రూపురేఖలు మార్చేలా రూ.41 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**
- **నాయుడుపేట--సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో హెచ్‌ఏఎం విధానంలో సమగ్ర మౌలిక వసతుల అభివృద్ధి**
- **రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలపై ప్రత్యేక దృష్టి.. నాణ్యతలో రాజీ వద్దన్న ఎమ్మెల్యే విజయశ్రీ**
- **అభివృద్ధిపై చర్చకు రండి.. వ్యక్తిగత విమర్శలు వద్దు**
- **దమ్ముంటే అభివృద్ధిపై ముఖాముఖి చర్చకు రావాలి: ఎమ్మెల్యే విజయశ్రీ**
- **వ్యక్తిగత దూషణలు మానుకోవాలని ఎమ్మెల్యే విజయశ్రీ సూచన**
- **సంజీవయ్య వ్యాఖ్యలకు ఎమ్మెల్యే విజయశ్రీ కౌంటర్**



**నాయుడుపేట- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో పట్టణ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా రూ.41 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) విధానంలో చేపట్టనున్న సమగ్ర మౌలిక వసతుల అభివృద్ధి పనులను మంగళవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో నియోజకవర్గంలోని పట్టణాలను మెరుగైన మౌలిక వసతులతో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పట్టణాల్లో దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

**రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం**

నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో అవసరమైన చోట నాణ్యమైన సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

**డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ**

వర్షపు నీరు, మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ, ఓపెన్ డ్రైనేజీ నెట్‌వర్క్, కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీంతో వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుధ్య సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**తాగునీటి సరఫరాకు చర్యలు**

పట్టణ ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు పైప్‌లైన్ల పునరుద్ధరణ, పంపిణీ వ్యవస్థ విస్తరణకు చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటి మౌలిక వసతులను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

**వీధిదీపాలు, సుందరీకరణ**

రాత్రి వేళల్లో ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించేలా నూతన వీధిదీపాలను ఏర్పాటు చేయడంతో పాటు ముఖ్య కూడళ్లను అభివృద్ధి చేసి సుందరీకరించనున్నట్లు తెలిపారు. పట్టణాల రూపురేఖలు మెరుగుపడేలా సమగ్ర ప్రణాళికతో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

**నాణ్యత విషయంలో రాజీ లేదు**

హెచ్‌ఏఎం విధానంలో చేపట్టే పనుల్లో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయడంతో పాటు దీర్ఘకాలిక నాణ్యత, నిర్వహణ బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజాధనం సక్రమంగా వినియోగం అయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తితే ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.

**అభివృద్ధిపై చర్చకు రావాలి**

కార్యక్రమం అనంతరం రాజకీయ అంశాలపై ఎమ్మెల్యే విజయశ్రీ స్పందిస్తూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తన కుటుంబ సభ్యులను ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే బదులు వ్యక్తిగత విమర్శలకు దిగడం తగదని పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలు పక్కనపెట్టి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై చర్చకు రావాలని సవాల్ చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆమె పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖల్లో నిధుల వినియోగంపై సమీక్షలు జరుగుతున్నాయని, అక్రమాలు జరిగినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపాలిటీల్లో రూ.41 కోట్ల అభివృద్ధి పనులతో పాటు గ్రామీణ రహదారుల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.9 కోట్ల మేర నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాలంగి వంతెన నిర్మాణం, సూళ్లూరుపేట క్లాక్‌టవర్, పట్టణ సుందరీకరణ పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ రఫీ, సూళ్లూరుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, శ్రీ చెంగాలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తిరుమూరు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వీఆర్‌ఏలకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలి

**- జేఏసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ చంద్ర**



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** వీఆర్‌ఏలకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని ఏపీ వీఆర్‌ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏపీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ చంద్ర అన్నారు. మంగళవారం తాసిల్దార్ కార్యాలయం సమీపన రిలే నిరాహార దీక్ష చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... వీఆర్‌ఏలకు తక్షణమే పే ప్లే అమలు చేయాలి, వీఆర్‌ఏ నుండి విఆర్‌ఓగా ప్రమోషన్ విషయంలో 70శాతం అమలు చేయాలి,వన్ టైం సెటిల్మెంట్ తక్షణమే అమలు చేయాలి,నైట్ వాచ్మెన్ డ్యూటీలను తక్షణమే రద్దు చేయాలని,వీఆర్వో, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్, వాచ్ మెన్ లకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలి,నామిని వీఆర్‌ఏలకు వెంటనే రెగ్యులర్ చేయాలి,పలు సమస్యలపై మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి తెలియ పరచాలని కోరారు, ఈ కార్యక్రమంలో జె ఏ సి సంఘ మండల అధ్యక్షులు తుమ్మ జయకృష్ణ,స్వాతి, గోపాల్, రమణయ్య, వెంకటేశ్వర్లు, రాజరత్నం, కృష్ణ వెంకటేశ్వర్లు, బక్కయ్య, గంగయ్య,కాంతమ్మ సుబ్రహ్మణ్యం, స్వప్న తదితరులు దీక్ష కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలపై నినాదాలు ఇస్తూ రిలే నిరాహార దీక్ష చేయడం జరిగింది.

## ‘ఆదర్శ కుటుంబం’ విడుదల వాయిదా..

# వెంకటేశ్ మూవీ వచ్చేది అప్పుడే!



వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47’. ఈ సినిమా విడుదల తేదీ మారింది. తొలుత అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం భావించింది. తాజాగా విడుదలను వారం రోజులు వాయిదా వేసింది. అక్టోబరు 9న సినిమాను థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ ప్రకటించింది. కుటుంబ అనుబంధాలకు యాక్షన్ అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. వెంకటేశ్ పాత్ర ఎలా ఉండబోతుందన్నదానిపై అభిమానుల్లోనూ ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తోంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ నటిస్తున్న తొలి చిత్రమిది కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. విడుదల తేదీ మారడంతో అభిమానులు అక్టోబరు 9 కోసం ఎదురుచూడాల్సి ఉంది.

# ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న యామీ గౌతమ్



2024 సంవత్సరానికి సంబంధించి ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ‘ఆర్టికల్ 370’ చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఈ చిత్రంలో అద్భుత నటనను కనబరిచిన ప్రముఖ నటి యామీ గౌతమ్ ధర్ జాతీయ ఉత్తమ నటిగా అవార్డును అందుకున్నారు. గుజరాత్‌లోని కేవడియాలో జరిగిన ఈ వేడుకలో గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పుర స్కారాల ప్రదానోత్సవం వైభవంగా నిర్వహిం చబడింది. జాతీయ పురస్కారాన్ని అందుకున్న అనంతరం యామీ గౌతమ్ తన సంతోషాన్ని మీడియాతో పంచుకున్నారు. “ఈ క్షణాన్ని నేను ఇంకా పూర్తిగా ఆస్వాదిస్తూనే ఉన్నాను. ఎన్నో కలలతో మహానగరానికి వచ్చి, నిరంతరం శ్రమించే ప్రతి కళాకారుడికి ఇది ఒక గర్వకారణం. జీవితం మన కోసం ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేసిందో ఎవరూ ఊహించలేరు. మనం వంతుగా మనం చేయాల్సింది కేవలం నిజాయితీగా కష్టపడటమే. అలా అంకితభావంతో పనిచేస్తే ఏదో ఒక రోజు ఖచ్చితంగా గమ్యాన్ని చేరుకుంటాం” అని ఆమె వ్యాఖ్యానించారు. దేశంలో ఒక కళాకారుడికి లభించే అత్యున్నత గుర్తింపు అయిన జాతీయ అవార్డును అందుకోవడం తనకెంతో గర్వంగా ఉందని యామీ పేర్కొన్నారు. ఇదే వేడుకలో ‘ఆర్టికల్ 370’ జాతీయ ఉత్తమ చిత్రంగానూ పురస్కారాన్ని దక్కించుకుంది.




అలాగే ‘భ్రమయుగం’ చిత్రంలో కనబరిచిన అద్భుత నటనకు గాను మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి ఉత్తమ నటుడిగా నిలిచారు. కల్కి 2898 ఏడీ చిత్రానికి గాను ఉత్తమ ప్రజాదరణ పొందిన సినిమా విభాగంలో దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాత అశ్వినీదత్ అవార్డులను అందుకున్నారు. ఇక పుష్ప-2 చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే విభాగంలో సుకుమార్ జాతీయ పురస్కారాన్ని స్వీకరించారు.



# రాష్ట్రపతి చేతుల మీదుగా

## ‘కమిటీ కుర్రోళ్లు’ టీమ్‌కు జాతీయ అవార్డు.. - నిహారిక కొణిదెల భావోద్వేగం!

‘కమిటీ కుర్రోళ్లు’ చిత్రానికి మరో అరుదైన గౌరవం దక్కింది. 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో ఈ సినిమా టీమ్ అవార్డును అందుకుంది. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు పురస్కారాలు అందజేశారు. ‘కమిటీ కుర్రోళ్లు’ నిర్మాత నిహారిక కొణిదెల, దర్శకుడు యదు వంశీ, మేకప్ ఆర్టిస్ట్ రవి కుమార్ పసుపులేటి రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా పింక్ ఎలిఫెంట్ టీమ్ ఆనందం వ్యక్తం చేసింది. అవార్డు అందుకున్న క్షణాలను సోషల్ మీడియాలో పంచుకుంటూ.. ఇది తమ టీమ్‌కు గర్వకారణమైన, భావోద్వేగంతో కూడిన రోజని పేర్కొంది. ఇక 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల వేడుకలో పలువురు ప్రముఖులు అవార్డులు అందుకున్నారు. ఉత్తమ నటులుగా మమ్ముట్టి (‘భ్రమయుగం’), కార్తిక్ ఆర్యన్ (‘చందూ ఛాంపియన్’) పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ నటిగా యామీ గౌతమ్ (‘ఆర్టికల్ 370’) అవార్డు దక్కించుకున్నారు. దిగ్గజ నటుడు అనంత్ నాగ్‌కు ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రదానం చేశారు. ‘కల్కి 2898 ఏడీ’ ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా పురస్కారం అందుకుంది. దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాత అశ్వినీదత్ ఈ అవార్డును స్వీకరించారు. ‘పుష్ప 2’ చిత్రంతో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా సుకుమార్ అవార్డు అందుకున్నారు. ‘కెప్టెన్ మిల్లర్’తో ధనుష్‌కు స్పెషల్ మెన్షన్ దక్కింది. ‘పుష్ప 2’కు ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా దీపాలి నూర్, సీతల్ శర్మ పురస్కారాలు అందుకున్నారు.






# టీమిండియాతో ఓడినా గర్వంగా ఉంది..

## ప్రపంచ అత్యుత్తమ జట్టుకు చెమటలు పట్టించాం: జపాన్ కెప్టెన్



చారిత్రక టీ20 మ్యాచ్‌లో పసికూన జపాన్ చేతిలో టీమిండియాకు అనూహ్య పరాభవం త్రుటిలో తప్పింది. సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో జపాన్ అద్భుత పోరాట పటిమ కనబరిచింది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో భారత్ కేవలం 2 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఈ విజయంతో భారత్ తన 200వ టీ20 గెలుపును (సూపర్ ఓవర్‌లతో కలిపి) నమోదు చేసుకుంది. మ్యాచ్ అనంతరం జపాన్ కెప్టెన్ కెండెల్ కడోవాకి-ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. తమ జట్టు ప్రదర్శన పట్ల గర్వంగా ఉందని అన్నాడు. “ఇంత దగ్గరగా వచ్చి ఓడిపోవడం కాస్త ఎక్కువ బాధ కలిగిస్తుంది. అయినప్పటికీ, నా అభిప్రాయంలో ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టును చివరి బంతి వరకు తీసుకురావడం చాలా ప్రత్యేకమైన విషయం. మా జట్టు ప్రదర్శన పట్ల గర్వపడుతున్నాను” అని తెలిపాడు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జపాన్ క్రికెట్ పురోగతిని ప్రశంసించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చెప్పాడు. ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను జపాన్ బౌలర్లు 32 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం 33 పరుగుల లక్ష్య ఛేదనలో ‘ఏదైనా సాధ్యమే’ అనే నమ్మకంతో బరిలోకి దిగామని కెప్టెన్ ఫ్లెమింగ్ అన్నాడు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ వంటి ప్రపంచ స్థాయి స్పిన్నర్లను ఎదుర్కోవడం సవాల్‌గా నిలిచిందని, అయినా చివరి వరకు పోరాడామని పేర్కొన్నాడు. ముఖ్యంగా 17 ఏళ్ల యువ బౌలర్ చార్లీ హింజే 17 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టడంపై ప్రశంసలు కురిపించాడు. ఈ మ్యాచ్ నిర్వహణకు సహకరించిన టైటిల్ స్పాన్సర్ సుజుకి, బీసీసీఐ, జపాన్ క్రికెట్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. వాలంటీర్లు, గ్రౌండ్ సిబ్బంది రాత్రంతా శ్రమించి మ్యాచ్‌కు మైదానాన్ని సిద్ధం చేశారని గుర్తు చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో తమలో ఆత్మవిశ్వాసం పెరిగిందని, తదుపరి మ్యాచ్‌లలో గెలిచి ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు చేరుకోవడమే తమ లక్ష్యమని ఫ్లెమింగ్ ధీమా వ్యక్తం చేశాడు.

# రెండు రోజు నాలుగు పతకాలు



**నగోయా:** ఆసియా క్రీడల్లో భారత షూటర్లు సత్తా చా టారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో హిమాంశు ధిల్లాన్ రజ తం, రుద్రాంక్ష్ పాటిల్ కాంస్యం సాధించారు. అంతకుముందు హిమాంశు, రుద్రాం క్ష్, 18 ఏళ్ల పార్త్ మానే కలిసి ఇదే విభాగం టీమ్ ఈవెంట్లో రజతం గెలిచారు. దీంతో షూటింగ్‌లో భారత్ పతకాల సంఖ్య ఐదుకు చేరింది. మొత్తం ఖాతాలో నాలుగు రజతా లు, ఒక కాంస్యం ఉన్నాయి.

**నేడే తుది పోరు:** టీమ్ ఈవెంట్‌లో చైనా 1899.0 పాయింట్లతో స్వర్ణం గెలిచి.. గతేడాది కైరోలో నెలకొల్పిన 1898. 4 ప్రపంచ రికార్డును మెరుగుపరిచింది. దక్షిణ కొరియా 1884.2 పాయింట్ల తో కాం స్యం సాధించగా.. భారత్ 1890.1 పాయింట్లతో రజతం దక్కించుకుంది. వ్యక్తిగత అర్హత పోటీలో రుద్రాంక్ష్ 631.8 పాయింట్లతో మూడో, హిమాంశు 630.0తో ఏడో స్థానంలో నిలవగా.. పార్త్ 628.3 పాయింట్లతో టాప్ ఎనిమిదిలో చోటు దక్కించుకో లేకపోయాడు.



**ఆసియా క్రీడల్లో మహిళా క్రికెట్ జట్టుకు స్వర్ణం..**

# ప్రధాని మోదీ ట్వీట్




ఆసియా క్రీడలు-2026లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి, ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంకను 147 పరుగుల భారీ తేడాతో ఓడించి, వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.

ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. “భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘం. ఈ విజయంతో దేశం గర్విస్తోంది. మీరు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారు” అని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ స్పందిస్తూ, షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ చారిత్రక విజయంతో భారత మహిళా జట్టుపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది.

## జిల్లా ఖజానాకు ఆదాయం పెంపే లక్ష్యంగా

# సమన్వయంతో పనిచేయాలి

**- జీఎస్టీ వసూళ్లపై ప్రత్యేక దృష్టి.. బకాయిల వసూళ్లకు కార్యాచరణ ప్రణాళిక**
**- అక్రమ మద్యం రవాణాపై కఠిన చర్యలు.. ఆదాయ వనరులను సమర్థవంతంగా వినియోగించాలి - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** జిల్లాలో ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించేందుకు అన్ని ఆదాయార్జన శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్లలో పారదర్శకత, సమర్థత పెంచడంతో పాటు బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం మదనపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్, రవాణా, గనులు, అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ తదితర ఆదాయార్జన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో శాఖల వారీగా ఆదాయ వసూళ్లు, లక్ష్యాలు, పురోగతి, బకాయిలు, భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఖజానాకు వచ్చే ప్రతి రూపాయి ఆదాయాన్ని క్రమబద్ధంగా సమీకరించేలా శాఖలు పనిచేయాలని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఆదాయ వృద్ధి సాధించేలా ప్రతి శాఖ స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందిం చుకోవాలని ఆదేశించారు.

**జీఎస్టీ వసూళ్లపై ప్రత్యేక దృష్టి**

కమర్షియల్ టాక్స్ శాఖపై సమీక్షిస్తూ, జిల్లాలో జీఎస్టీ వసూళ్లను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచిం చారు. ప్రస్తుతం 2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ?278.15 కోట్ల జీఎస్టీ లక్ష్యం ఉందన్నారు. ప్రత్యేక సర్కిల్‌ను మినహాయించి నికర ఎస్‌జీఎస్టీ వసూళ్లలో మెరుగైన వృద్ధి నమోదవుతున్నట్లు తెలిపారు. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో జరిగే పనులకు సంబంధించి బిల్లులు ప్రాసెస్ చేసే సమయం లో కాంట్రాక్టర్ల జీఎస్టీ రిజిస్ట్రేషన్ యాక్టివ్‌గా ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. జీఎస్టీ నిబంధనలపై మండల అభివృద్ధి అధికారులు, గ్రామ పంచాయతీలకు అవగాహన కల్పించి, అర్హులైన సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ శాఖ నుంచి అందిన ట్రేడ్ లైసెన్స్ వివరాలను కమర్షియల్ టాక్స్ శాఖతో సమన్వయం చేసుకుని, ఇంకా జీఎస్టీ పరిధిలోకి రాని వాణిజ్య సంస్థలను గుర్తించాలని తెలిపారు. గతంలో చేపట్టిన చర్యల ఫలితంగా జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో 19.06 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారుల నివేదికలో పేర్కొన్నారు.

**జీఎస్టీ, పన్ను బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ**

జిల్లాలో మొత్తం జీఎస్టీ బకాయిలు ?263 కోట్లు ఉండగా, అందులో వసూలు చేయదగిన బకాయిలు ?96 కోట్లుగా ఉన్నాయని అధికారులు వివరించారు. ఈ బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకర్ల కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి, నిబంధనల మేరకు బ్యాంకు అటాచ్‌మెంట్ చర్యలను చేపట్టాలని సూచించారు.

**అక్రమ మద్యం రవాణాపై కట్టుదిట్టమైన నిఘా**

ఎక్సైజ్ శాఖపై సమీక్షిస్తూ, మద్యం దుకాణాలు, బార్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిరం తరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత బలోపేతం చేయాలని, అక్రమ రవాణా, అక్రమ విక్రయాలపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**గనుల ఆదాయంపై ప్రత్యేక దృష్టి**

గనుల శాఖలో ఆదాయ వసూళ్లను సమీక్షించిన కలెక్టర్, ఖనిజ వనరుల వినియోగం, క్వారీ లీజులు, రవాణా తదితర అంశాలను క్రమబద్ధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు గనుల శాఖ నిర్దేశించిన లక్ష్యం ?27 కోట్లుగా ఉండగా, సెప్టెంబరు 21 నాటికి ?33.62 కోట్ల ఆదాయం సాధించినట్లు అధికారులు వివరించారు.

**రవాణా శాఖలో బకాయిల వసూళ్లకు చర్యలు**

రవాణా శాఖలో 2026 ఆగస్టు వరకు ?48.78 కోట్ల ఆదాయం సాధించినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోల్చితే 9.87 శాతం వృద్ధి నమోదైనట్లు వివరించారు. పన్నులు, లైఫ్ టాక్స్, డిటెక్షన్ తదితర విభాగాల్లో వసూళ్లను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు.

పన్నులు చెల్లించని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ బకాయిలను నిబంధనల మేరకు వసూలు చేయాలని ఆదేశించారు.

**పంచాయతీరాజ్, మున్సిపల్ ఆదాయాలపై ప్రత్యేక పర్యవేక్షణ**

గ్రామపంచాయతీల పరిధిలో ఇంటి పన్ను, ట్రేడ్ లైసెన్స్, మార్కెట్ ఆదాయం, బస్‌స్టాండ్ తదితర ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పన్ను బకాయిలను గుర్తించి వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

మున్సిపాలిటీల పరిధిలో అన్‌అసెస్డ్, అండర్‌అసెస్డ్ ఆస్తులను గుర్తించి పన్ను పరిధిని విస్తరించాలని, ప్రస్తుత డిమాండ్‌తో పాటు బకాయిల వసూళ్లను కూడా సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు.

**ప్రొఫెషన్ ట్యాక్స్ పరిధిని విస్తరించాలి**

ప్రొఫెషన్ ట్యాక్స్ పరిధిలోకి రాని వృత్తులు, సంస్థలను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలని కలెక్టర్ సూచించారు. విద్యాశాఖ, మున్సిపాలిటీలు, వృత్తి సంఘాల నుంచి అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఉపయోగించి కొత్త రిజిస్ట్రేషన్లను గుర్తించాలని, అన్ని ప్రభుత్వ శాఖలు, పీఎస్‌యూలు, డీడీవోలు నిబంధనల ప్రకారం ప్రొఫెషన్ ట్యాక్స్ నమోదు, చెల్లింపులు సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు.

**రెవెన్యూ వింగ్'తో నిరంతర పర్యవేక్షణ**

కెఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'రెవెన్యూ వింగ్' ఆదాయ వసూళ్లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. శాఖల వారీగా రోజువారీ పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి వారం బిల్లులు, వసూళ్లు, బకాయిల వివరాలను సేకరించాలని ఆదేశించారు. కమర్షియల్ టాక్స్ శాఖతో పాటు మైన్స్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్, రవాణా, అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఒక శాఖకు సంబంధించిన సమాచారాన్ని మరో శాఖతో పంచుకోవడం ద్వారా పన్నుల పరిధి, వసూళ్లను మెరుగు పరచాలని సూచించారు. ఆదాయ వసూళ్లలో నాణ్యత, పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఎలాంటి లోటు లేకుండా సమకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి బృహత్తర అడుగు

**- జిల్లాలో 4 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం రూ.94 కోట్ల విలువైన హెచ్‌ఏఎం అభివృద్ధిపనులకు ప్రభుత్వ ఆమోదం**
**- మదనపల్లెలో రూ.27 కోట్ల హెచ్‌ఏఎం అభివృద్ధి పనులకు శంకుస్థాపన: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** పట్టణ ప్రాంతాల్లో ఆధునిక మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగా జిల్లాలోని 4 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం రూ.94 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ లో వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనులకు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ లో తొలిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 106 నియోజకవర్గాల్లోని 123 మున్సిపాలిటీలలో ఒకేసారి రూ.11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంగళవారం కుప్పం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేసి పట్టణాల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో రోడ్లు, సెంట్రల్ మీడియన్లు, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ నిధులను ఖర్చు చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్థానిక ఎన్‌వీఆర్ కళ్యాణ మండపంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వర్చువల్ గా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, బి.కొత్తకోట, పుంగనూరు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం రూ.94 కోట్ల విలువైన పనులకు ప్రభుత్వ ఆమోదం లభించిందన్నారు. ఇందులో మదనపల్లె మున్సిపాలిటీకి రూ.27 కోట్లు, రాయచోటికి రూ.35 కోట్లు, బి.కొత్తకోటకు రూ.12 కోట్లు, పుంగనూరుకు రూ.20 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లాలోని నాలుగు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులు పట్టణాల రూపురేఖలను మార్చడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. జిల్లాకేంద్రంగా మదనపల్లె ఏర్పడిన అనంతరం పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, స్థానిక నాయ కులు, ప్రజల నుంచి జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిన వివిధ విజ్ఞప్తులను ప్రభుత్వానికి నివేదించామని,వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అన్నారు. జిల్లాకేంద్రానికి అవసరమైన ముఖ్యమైన రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి జిల్లా మినరల్ ఫౌండేషన్ (ఐవీఖీ) నిధులను వినియోగిస్తున్నామని తెలిపారు. స్థానిక శాసన సభ్యులు విజ్ఞప్తి మేరకు ఉపాధి హామీ పథకం కింద మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి సుమారు రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే జిల్లా మినరల్ ఫౌండేషన్ ద్వారా మదనపల్లె జిల్లాకేంద్ర అభివృద్ధికి గత నెలలో సుమారు రూ.10 నుంచి రూ.20 కోట్ల వరకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (నావీ) కింద సుమారు రూ.27 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఈరోజు పరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద ఇప్పటికే సుమారు రూ.35 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చెప్పారు.

**పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకం**

స్వచ్ఛ భారత్ మిషన్ కింద తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణానికి సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు కాగా, పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతున్న అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు సుమారు రూ.56 కోట్ల ప్రతిపాదనలు అనుమతి దశలో ఉన్నాయని వివరించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం సిబ్బంది నిరంతరం కష్టపడుతున్నప్పటికీ, ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మునిసిపల్ కమీషనర్ ప్రమీల, టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్ బాషా కుమారుడు మహమ్మద్ జుబేద్ అక్బర్, వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ నవీన్, నాయకులు రాజన్న, రఘుపతి, నీలకంఠ, సంబంధిత మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విజయవాడలో ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

**- నోబుల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** విజయవాడ శాప్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులపై కొందరు రాజకీయ వ్యక్తులు చేసిన దాడులను నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేతాజీ సర్కిల్ రాయచోటి నందు ఏర్పాటు చేసిన సమావేశంలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరాజు మాటా్లడుతూ... రాజకీయ ముసుగులో ఉపాధ్యాయులపై చేసిన దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ ముసుగులో వారు ప్రవర్తించిన తీరు ఉపాధ్యాయులపై చేసిన ఆరోపణలు, ఉపాధ్యాయులను నీచాతి నీచంగా సభ్య సమాజం తలదించుకునే విధంగా మాట్లాడిన తీరు చాలా బాధాకరం అన్నారు. గత రెండు నెలలుగా వారు చేసిన ఆరోపణలకు అధికారులు పూర్తి సమాచారాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఇలా ప్రవర్తించడం సబబు కాదన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నల్లమల రామాంజులు గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చట్టంలో కొన్ని మార్పులు చేసి ఉపాధ్యాయులపై దాడి చేసిన వారికి కఠిన శిక్షలు అమలు అయ్యే విధంగా చట్టాలలో మార్పులు తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో పకీర, నాగరాజు, పీరయ్య, రామ నాయుడు, రాజేంద్ర నాయుడు, రెడ్డయ్య రాజు, మధుసూదన రెడ్డి, రమేష్ రాజు, వెంకటరామరాజు, రాచయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వపు మఠాధిపతి వెంకటేశ్వర స్వామి ఆరాధన మహోత్సవాలు





**బ్రహ్మంగారిమఠం -సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఐదవ తరం, తొమ్మిదవ పూర్వపు మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆరాధన మహోత్సవాలను ప్రస్తుత మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆరాధన మహోత్సవంలో భాగంగా పూర్వపు మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి మునిమనవడు ప్రస్తుత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారు మఠం ప్రాంగణంలోని వెంకటేశ్వర స్వామి సమాధి వద్ద ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూర్వపు మఠాధిపతి చిత్రపటానికి పూజలు చేసి భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు మఠాధిపతి వెంకటేశ్వర స్వామి ఆధ్యాత్మిక సేవలను స్మరించుకున్నారు. ఆరాధన మహోత్సవంలో మఠాధిపతి సోదరులు దత్తాత్రేయ స్వామి, ఆస్థాన సిద్ధాంతులు, అర్చకులు, పూర్వపు మఠాధిపతి శిష్యులు, భక్తులు, మఠం సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆప్కాస్ ఉద్యోగుల రాయలసీమ రణభేరిని జయప్రదం చేయండి

**- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పిలుపు**

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** సెప్టెంబర్ 27న తిరుపతిలో జరగనున్న రాయలసీమ రణభేరిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశం లో వారు మాట్లాడుతూ,రాష్ట్రంలో 91 డిపార్ట్ మెంట్లలో ఆప్కాస్, ఔట్ సోర్సింగ్ పేరుతో లక్షలాది మంది ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని, అయినా వారికి రెగ్యులరైజేషన్ లేదు, సమాన పనికి సమాన వేతనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారే తప్ప వేతనాలు పెంచడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. జీతాలు పెంచాలని జిల్లా అధికారులకు, మంత్రులకు, ముఖ్యమంత్రికి వినతిపత్రాలు ఇస్తే "ఇది మా చేతిలో లేదు" అని తప్పించు కుంటున్నారని, నిత్యావసర ధరలు, పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం ఛార్జీలు ఆకాశాన్ని తాకుతుంటే, కార్మికుల వేతనాలు మాత్రం భూమికి అంటుకుని ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వృద్ధాప్య, వితంతు పెన్షన్లు కూడా వీరి కుటుంబాలకు అందడం లేదని, చనిపోయిన కార్మికుని స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వడం లేదని, దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు వయోపరిమితి 62 ఏళు పెంచి, ఔట్ సోర్సింగ్ కార్మికులకు మాత్రం 60 ఏళ్లకే ముగించడం దారుణ మన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాయకుండా, ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి సెప్టెంబర్ 13న "రణభేరి – ఇక సమరమే" అనే నినాదంతో ప్రచారం ప్రారంభించి, సెప్టెంబర్ 27న తిరుపతిలో రాయలసీమ రణభేరిని ముగిస్తున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి భాగ్యలక్ష్మి, నాయకులు మాధవ్, మస్తాన్, రైతు సంఘం నాయకులు రామచంద్ర లు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140

## మినమలమూడి అంగన్వాడీ కేంద్రంలో
## పోషకాహార మాసోత్సవం



**దొరవారిసత్రం–సూర్య వాస్తవం:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మహ్ అనే కార్యక్రమం ద్వారా పోషకాహార మాస్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో భాగంగా సూళ్లూరుపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ జ్యోతి కిరణ్,సూపర్వైజర్ అంకమ్మ దొరవారిసత్రం మండల పరిధిలోని మినమలముడి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార మాసోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే- మహాభాగ్యం అన్న సామెత నిజం కావాలంటే ప్రతి ఒక్కరికి దినసరి ఆహారంలో అందాల్సిన సమ పోషక పదార్థాలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు.ప్రధానంగా గర్భవతి, బాలింతలు ఆరోగ్యకరంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా ఆరేళ్లలో పిల్లలు కూడా ఆరోగ్యంతో పాటు,శారీరక ఎదుగుదల,మానసిక పరిపాక్వత రావాలంటే పోషకాహారాన్ని వారికి అందించాలని పేర్కొన్నారు. రక్తహీనత నివారణకు ఐరన్ కలిగిన ఆకుకూరలను అధికంగా తీసుకోవాలని చెప్పారు.బాలల వికాసం, సమాజ భాగస్వామ్యం,అనే అంశాలపై చర్చించారు. చిన్నారులు చిన్ననాటి నుండి ఆట వస్తువులతో అవగాహనతో కూడిన విద్య అలవర్చుడానికి అవగాహన కల్పించాలి తప్ప,సెల్ ఫోన్ లు,టీవీలకు చిన్ననాటి నుండి బానిసత్వం కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ జ్యోతి కిరణ్,సూపర్వైజర్ అంకమ్మ, కార్యకర్తలు,గర్భవతులు,కిశోర బాలికలు,చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..
### - ఎస్ఐ శివ శంకర్



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకు నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నిలిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట ఎస్సై ఎం.శివశంకర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో పోలీసులు పాత బస్టాండ్, దర్గా వీధి తదితర రద్దీ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నోపార్కింగ్ ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.ఎస్సై శివశంకర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి వాహనదారులకు అవగాహన కల్పించారు.దర్గా రోడ్డులో కేటాయించిన పార్కింగ్ స్థలంలో కేవలం ద్విచక్ర వాహనాలను మాత్రమే నిలిపేందుకు అనుమతి ఉందని స్పష్టం చేశారు. ఆటోలు, కార్లను అక్కడ పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించేది లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. పోలీసుల చర్యలపై పట్టణ ప్రజలు,వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

## డ్రైవింగ్ లైసెన్స్‌కు మొబైల్ నంబర్ అనుసంధానంపై తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** డ్రైవింగ్ లైసెన్స్‌కు మొబైల్ నంబర్‌ను సెప్టెంబర్ 25లోపు అప్‌డేట్ చేయకపోతే లైసెన్స్ రద్దవుతుందని, చెల్లుబాటు కోల్పోతుందని సోషల్ మీడియా,వాట్సాప్‌లలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని రవాణా శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు ఈ ప్రచారాన్ని నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే రవాణా శాఖ సేవలు,చలానాలు,రెన్యువల్ తదితర సమాచారాన్ని సకాలంలో పొందేందుకు డ్రైవింగ్ లైసెన్స్‌కు ప్రస్తుత మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవడం ప్రయోజనకరమని తెలిపారు. ధ్రువీకరించని సందేశాలను ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా, రవాణా శాఖకు సంబంధించిన సమాచారాన్ని అధికారిక వర్గాల ద్వారా మాత్రమే నిర్ధారించుకోవాలని వాహనదారులకు సూచించారు.

# కొత్తచెరువులో జెడ్పీ కార్యాలయం...!

**- 25 నుంచి కొత్త జిల్లాల్లో జెడ్పీ పాలన ప్రారంభం**
**- అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఓ. ఆనంద్, శ్యామ్ ప్రసాద్ ఆమోదం**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** శ్రీ సత్యసాయి జిల్లాకు కొత్తచెరువులో జిల్లా పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కొత్తచెరువులో ఉన్న మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని జెడ్పీ కార్యాలయంగా వినియోగించేందుకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఓ. ఆనంద్, శ్యామ్ ప్రసాద్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నెల 25 నుంచి కొత్త జిల్లాల్లో జెడ్పీ పాలన ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు.

**25 నుంచి కొత్త జిల్లాల్లో జెడ్పీ పాలన**

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలకు సంబంధించి జిల్లా పరిషత్ కార్యాలయాల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం ఈ నెల 24తో ముగియనుండటంతో, 25 నుంచి కొత్త జిల్లాల పరిధిలో జెడ్పీ పాలన ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది.

**కొత్తచెరువు భవనానికే ప్రాధాన్యం**

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జెడ్పీ కార్యాలయానికి అనువైన భవనం కోసం కొంతకాలంగా అధికారులు పరిశీలనలు చేపట్టారు. అయితే భవనాల కొరత నేపథ్యంలో కొత్తచెరువులోని మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ కార్యాలయానికి ఎంపిక చేశారు. ధర్మవరం--అనంతపురం ప్రధాన రహదారికి సమీపంలో ఉండటంతో ఉద్యోగులు, ప్రజలకు రాకపోకల పరంగా అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

**చురుగ్గా కార్యాలయ ఏర్పాట్లు**

మండల పరిషత్ కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించి, అందులో జిల్లా పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. కార్యాలయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.

**ఉద్యోగుల విభజన పూర్తి**

కొత్తగా ఏర్పాటు కానున్న జిల్లా పరిషత్ కార్యాలయాలకు అవసరమైన సిబ్బంది కేటాయింపు ప్రక్రియను అధికారులు ఇప్పటికే పూర్తి చేసినట్లు సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల అనుమతితో విభజన చేపట్టారు.

ఉద్యోగుల తుది జాబితాను ఈ నెల 24న అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రూ.41 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**- పట్టణాలను అత్యాధునిక మౌలిక వసతులతో ఆదర్శ పట్టణాలుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**




**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ ఎ ఎం) ద్వారా చేపట్టనున్న రూ.41 కోట్ల విలువైన సమగ్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో నియోజకవర్గంలోని పట్టణాలను అత్యాధునిక మౌలిక వసతులతో ఆదర్శ పట్టణాలుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రహదారుల విస్తరణ,నిర్మాణంలో భాగంగా మున్సిపాలిటీలలోని ప్రధాన మార్గాలు, అంతర్గత వీధుల్లో నాణ్యమైన సీసీ రోడ్లు,బీటీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ భాగంగా లో వర్షపు నీరు మరియు మురుగునీరు సాఫీగా సాగేందుకు సమగ్ర భూగర్భ,ఓపెన్ డ్రైనేజీ నెట్‌వర్క్,కాలువల నిర్మాణాలు చేపడతామన్నారు. పట్టణ ప్రజలందరికీ నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు పైప్‌లైన్ల పునరుద్ధరణ పంపిణీ వ్యవస్థ విస్తరణ చేయనున్నట్లు తెలిపారు.రాత్రి వేళల్లో ప్రజల రక్షణ,సౌకర్యార్థం నూతన వీధిదీపాల ఏర్పాటు మరియు ముఖ్య కూడళ్ల సుందరీకరణ పనులు చేపడతారని అన్నారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానం ద్వారా పనుల్లో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలు పాటించడంతో పాటు,నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం మరియు దీర్ఘకాలిక నాణ్యత, నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్లకే ఉంటుందని తెలిపారు.? ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా పనుల్లో నాణ్యత లోపిస్తే ఏమాత్రం సహించేది లేదని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేసి గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట సూళ్లూరుపేట టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ,ఆకుతోట రమేష్,శ్రీ చెంగాలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తిరుమూరు సుధాకర్ రెడ్డి,పలువురు నాయకులు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ్ మాసం కార్యక్రమం





**విజయపురం – సూర్య వాస్తవం:** మండలం బూచివానత్తం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ్ మాసం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్లు లక్ష్మీ, శ్యామల హాజరై పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు లక్ష్మీ, శ్యామల మాట్లాడుతూ, లిచిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకా హారం ఎంతో అవసరమనిలి తెలిపారు. ప్రతిరోజూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం కీలకమని వివరించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించు కోవడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవచ్చని తెలిపారు. పోషణ్ మాసం కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పోషకాహారంపై మరింత అవగాహన కల్పించడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లలిత, రాణి, ఎలిజబెత్ రాణి తదితరులు పాల్గొన్నారు.